# 9

# ధన్యతలు

## (5:1-12)

కొండ మీద ప్రసంగము (అధ్యాయము 5-7) ఆయన రచించిన సువార్తలో మత్తయి చేర్చిన తొలి ఉపదేశ విభాగముగా ప్రయోజనపడుచున్నది. దానితో పాటుగా, ఆయన యేసును ఇశ్రాయేలీయుల చివరి ఉపదేశకునిగా, అనగా ఆయన మాటలు దైవికమైన అధికారముతోను నిత్య పరిణాములతోను నిండియుండినవానిగా (7:21-29) చిత్రీకరించాడు. మత్తయి గ్రంథస్థం చేసిన ఈ ప్రసంగము కేవలము నైతిక బోధనల సేకరణయై యుండుటను మించినదై యున్నది. నిత్యజీవము పొందువారి మీద మెస్సీయయైన యేసు కలిగియున్న సర్వోచ్ఛమైన అధికారమును అది ప్రతిబింబించుచున్నది.[1]

ఈ ప్రసంగము ఆజ్ఞారూపకమైన విధివాచకములకు బదులుగా ధన్యతలతో మొదలౌతొంది. అటుతరువాత, అది శాస్త్రులు మరియు పరిసయ్యుల నీతిని అధిగమించు అత్యున్నతమైన ప్రమాణముల స్థాయిని చేరుకొనుచున్నది, అట్లయినను కృప సంబంధితమైన సందర్భమును అది ఎన్నడును మరువలేదు.[2] అది ఉన్నతమైనది మరియు పరిశుద్ధమైనదై యున్నది, కానీ అది అనుభవసిద్ధమును, ఆచారాణాత్మకమునై యున్నది. యేసు చేసిన అధికారపూర్వకమైన ఉపదేశములు – ఈ ప్రసంగములో సంగ్రహముగా చెప్పబడినవి మరియు వితరణము చేయబడినవి – యేసు ఇచ్చిన మహా ఆదేశమును అపేక్షించుచున్నవి. ఆయన అపొస్తలులకు చివరిసారిగా అప్పగించిన బాధ్యతలో, వారు సమస్త జనులను శిష్యులనుగా చేయుచు ఆయన వారికి ఏయే సంగతులను ఆజ్ఞాపించెనో వాటినన్నిటిని గైకొనునట్లు వారికి బోధించవలెననియు యేసు వారికి ఆజ్ఞాపించాడు (28:18-20).

కొండ మీద ప్రసంగం యొక్క సరైన సంక్షిప్త వర్ణనను స్పష్టంగా సూత్రీకరించుట కష్టమైన పనే. ఏదిఏమైనా, ఈ ప్రసంగము యొక్క ప్రధాన అధికాంశము "ధర్మశాస్త్రము" మరియు "ప్రవక్తల లేఖనములకు" సంబంధించిన రిఫరెన్సుల ఆధారంగా రూపుదిద్దుకొనబడినదని మాత్రం స్పష్టంగా తెలియుచున్నది (5:17; 7:12). ఈ క్రింది సంక్షిప్త వర్ణన యేసు తన ఉపదేశములలో పేర్కొనిన ఆయా విషయాల గూర్చిన ఒక సామాన్యమైన చిత్రమును మనముందుంచుచున్నది.[3]

I. ఉపోద్ఘాతము (5:3-16)
 A. ధన్యతలు (5:3-12)
 B. ఉప్పు మరియు వెలుగు (5:13-16)
II. ప్రధాన అధికాంశము (5:17-7:12)
 A. పాత మరియు క్రొత్త నీతి (5:17-48)
 B. బాహ్యమైన మరియు ఆంతరంగికమైన నీతి (6:1-18)
 C. దేవుని మీద ఆధారపడుట (6:19-34)

D. నానావిధములైన ఉపదేశములు మరియు బంగారు నియమము (7:1-12)

III. ముగింపు (7:13-27)

A. రెండు మార్గములు (7:13, 14)

B. అబద్ధమైనవి మరియు యథార్థమైనవి (7:15-23)

C. ఇద్దరు భవననిర్మాణకుల ఉపమానము (7:24-27)

మత్తయి రాసిన సువార్తలో గల కొండ మీద ప్రసంగమునకును లూకా రాసిన సువార్తలో గల (లూకా 6:17-49) మైదానములో చేయబడిన ప్రసంగమునకును మధ్య గల తారతమ్యములను పోల్చవచ్చును. వాస్తవమునకు ఈ రెండు ప్రసంగములు కూడ ఒకటే ప్రసంగమనియు, లూకా తన అనువాదమును కొండ మీద చేయబడిన ప్రధాన ప్రసంగమంతటిని మామూలుగా క్లుప్తపర్చాడనునది ఒక దృష్టికోణమై యున్నది. ప్రసంగ విషయము, ప్రయోగింపబడిన భాష, మరియు అనుసరింపబడిన క్రమములో కనబడిన పోలికలు ఇటువంటి దృక్పథమునకు తావిచ్చినవి.[4] అవి రెండును వెవ్వేరు సందర్భములలో ఉపదేశింపడిన వెవ్వేరు విలక్షణమైన ఉపదేశములై యున్నవనునది మరొక దృష్టికోనమై యున్నది. ఈ రెండింటి నడుమ అనేక తారతమ్యములున్నవి. ఉదా॥ ఈ ప్రసంగములు చేయబడిన ఏర్పాటు/వాతావరణము గూర్చిన వర్ణన భిన్నముగా ఉన్నట్లు అగుపించుచున్నది: “కొండ యెక్కి” (మత్తయి 5:1) దానికి ప్రతిగా “మైదానమందు” (లూకా 6:17) అని రాయబడి యున్నది. ఇంకా, లూకా నివేదించుచున్న ప్రసంగములో గల ధన్యతలు మత్తయి రాసిన సువార్తలో గల ధన్యతల కంటే తక్కువగా ఉన్నవి (కొన్నింటి మాటలు భిన్నముగా ఉన్నవి), మరియు మత్తయి రాసిన సువార్తలో లేని శ్రమలు లూకా రాసిన సువార్తలో పేర్కొనబడినవి (లూకా 6:20-26).

ఈ రెండు ప్రసంగములను పోల్చుచు, జాక్ పి. లూయిస్ ఈ క్రింది సందర్భ సహితమైన వ్యాఖ్యాలు చేశాడు:

1. ఈ రెండు ప్రసంగములు ధన్యతలతో మొదలగుచున్నవి (5:3-12; లూకా 6:20-22) మరియు భవననిర్మాణకుల ఉపమానముతో ముగియుచున్నవి (7:24-27; లూకా 6:47-49).
2. మత్తయి రాసిన సువార్తలో గల ప్రసంగము లూకా రాసిన సువార్తలో గల ప్రసంగము కంటె (30 వచనములు) సుధీర్ఘమైనదై యున్నది (107 వచనములు).
3. లూకా రాసిన సువార్తలో గల విషయము ప్రసంగములో ఉన్నది.
4. మత్తయి రాసిన సువార్తలో ప్రసంగ విషయము లూకా రాసిన సువార్తలోని ఇతర భాగములలో (అధ్యాయము 11, 12, 13, 14, 16) చెదురుమదురుగా నున్నది.
5. మత్తయి రాసిన సువార్తలో నున్న ప్రసంగము యేసు తన పన్నెండు మంది శిష్యులను ఏర్పరచుకొనిన (10:1-4) సంఘటన తరువాత గ్రంథస్థం చేయబడి యున్నది (లూకా 6:12-16).[5]

మత్తయి మరియు లూకా రాసిన సువార్తలలో గల ప్రసంగములు ఆనాటి కాలములో

విభిన్న సమయములందు చేయబడినవనునది చాలా వరకు సాధ్యమే. ఏంతైనా, యేసు భిన్నమైన అనేక జనసమూహములకును ప్రేక్షకులకును ఉపదేశించాడు గనుక ఆయన తరుచుగా తన ఉపదేశములను పునరుక్తముగావించుటలో సందేహముండదు. ఇది ఇలా ఉండగా, మత్తయి మరియు లూకా ఒకే ప్రసంగమును నివేదించుచుండవచ్చును – మత్తయి కొండ ప్రదేశమును నొక్కిచెప్పుచుండగా లూకా కొండ ప్రాంతములో నున్న మైదాన ప్రదేశమును నొక్కివక్కాణించుచున్నాడు. ఏమి సంభవించినదో యను విషయముతో నిమిత్తము లేకుండా చూచినట్లయితే, ప్రతి ఒక్క గ్రంథకర్త తన సువార్త నివేదికలో చేర్చిన విషయాలను ఏరికోరి ఎన్నుకొన్నాడని అర్థమగుచున్నది. మత్తయి, ప్రత్యేకంగా ధర్మశాస్త్రమునకు మరియు తన యూదీయ పాఠకులకు సంబంధించిన ఉపదేశమును ఎన్నుకొన్నాడు, దీనిలో కొంత భాగము లూకా రచించిన సువార్తలో కనిపించదు, అయితే లూకా ప్రత్యేకంగా అన్యజనులైన పాఠకులకు ప్రయోజనకరంగా ఉండగల విషయాలను ఎన్నుకొన్నాడు.[6]

యేసు కొండ మీద చేసిన ప్రసంగములో, ఆయన – తన ప్రసంగమునకు ఒక విధమైన ప్రస్తావనగా – ప్రామాణికమైన నీతి మరియు సంతోషము గూర్చిన బోధనలను చేయుటతో తన ప్రసంగమును ప్రారంభించాడు. దైవభక్తిగల జీవితము గూర్చి ఆయన వివరించిన విధానము చూచినట్లయితే నేటి సంస్కృతికి సంబంధించిన దృష్టికోణమునకు అది సంపూర్తిగా వ్యతిరేకమైనదై యున్నది. యథార్థమైన నీతి నిమిత్తము అనివార్యమైన ఈ అవశ్యకతలు "ధన్యతలు" అని సామాన్యంగా సంబోధింపబడు యేసు ఘోషణలలో మూర్తీభవింపబడి యున్నవి. ఈ పదము *beatitudo* అను లాటిన్ పదము నుండి ఉత్పన్నమగుచున్నది, ఇది తిరిగి "సంతోషము," "అదృష్టము," లేక "ధన్యులు" అని అర్థమిచ్చు గ్రీకు పదము *makarios* యొక్క అనువాదమై యున్నది.

వాని గూర్చి దేవుడు సంతోషించుచు నీతిమంతుడైనవానిని వర్ణించుటకు యేసు *makarios* అను పదమును ఈ పన్నెండు వచనములలో తొమ్మిది పర్యాయములు ప్రయోగించాడు. "ధన్యుడు" అను పదము ఎల్లప్పుడు బహువచనములో ఉంటుంది, బహుశ దైవభక్తిగలవాడు పొందు అట్టి సంతోషము యొక్క నిండుతనాన్ని అది సూచింపవచ్చును. ఈ పదము ప్రయోగింపబడిన ప్రతి సందర్భములో, వెనువెంటనే దానిని ప్రదర్శించువాని లక్షణముతోపాటు ఆశీర్వాదకరమైన ఒక అత్యుత్తమ వాగ్దానము కూడ ఉంటుంది.

ఈ ధన్యతలలో కనబడుచున్నట్లుగా, నిజమైన ఆనందం నీతిమంతమైన జీవితము యొక్క అనుబంధోత్పత్తియై యున్నది. ఆధ్యాత్మిక ఆనందం ఒకని జీవితమును అత్యంత నిరుత్సాహకరమైన సమయాల్లో సహితం సంతృప్తితో నింపుతోంది (ఫిలిప్పీయులకు 4:11, 12; 1 తిమోతి 6:6–11).[7]

## ఉపోద్ఘాతము (5:1, 2)

**[1]ఆయన ఆ జనసమూహములను చూచి, కొండయెక్కి కూర్చుండగా, ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చిరి. [2]అప్పుడాయన నోరు తెరచి యీలాగు బోధింపసాగెను–**

**వచనములు 1, 2. యేసు … కొండయెక్కి** "కొండ" అని అర్థమిచ్చు గ్రీకు పదము తారతమ్యమునుబట్టి చూచినట్లయితే అది భూమట్టం నుండి బాగా కనిపించు ఒక ఎత్తైన

భాగమని ఉత్తమంగా గ్రహింపనగును (14:23; 15:29 చూడుము). మత్తయి రాసిన సువార్తలోని ముఖ్యమైన ఇతర సంఘటనలు ఎత్తైయిన ఉన్నతాంశములకు, మూడవ శోధన (4:8). యేసు రూపాంతరము (17:1). మరియు మహా ఆదేశము కలుపుకొని (28:16), సంబంధించినవై యున్నవి.

మోషే, అనగా పాత నిబంధన వ్యవస్థాపింపబడునట్లు సీనాయి కొండ మీద ధర్మశాస్త్రమును పొందినవానికిని (నిర్గమకాండము 19-24), యేసునకును, అనగా క్రొత్త నిబంధనకు సిద్ధపాటుగా కొండ మీద ఒక క్రొత్త నియమమును బయలుపరచినవానికిని మధ్య గల సమాంతరమును ఈ వాక్యభాగము చూపుచున్నదా? ఈ అభిప్రాయము అంత విపులంగా లేకపోయినను, యేసు, ఆయన అధికారపూర్వకమైన వాక్కునకు లోబడవలెనని మోషే నోట పలుకబడిన ఆ "ప్రవక్త"యై యున్నాడను వాస్తవమునకు అది అనుగుణ్యముగా నున్నది (ద్వితీయోపదేశకాండము 18:15, 18; అపొస్తలుల కార్యములు 3:22, 23; 7:37; యోహాను 6:14; 7:40 చూడుము).

యేసు చేసిన ఉపదేశమునకు సంబంధించినవి వెవ్వేరు స్థలములు ప్రతిపాదింపబడినవి. వాటిలో ఒకటి "హత్తీము కొమ్ములు" అని అర్థమిచ్చు "కర్నె హిత్తీము" అని పిలువబడుచున్నది, ఏలయనగా అది రెండు శిఖరములు కలిగియున్నది. వాస్తవమునకు ఈ స్థలము తిబెరియకు సమీపమున నుండిన అగ్నిపర్వతము అంతరించిన చోటై యున్నది. రమణీయమైన ఈ ప్రకృతి దృశ్యమును ఫ్రాంక్ ఎల్. కొక్స్ ఇలా వర్ణించుచున్నాడు:

> సముద్ర మట్టమును మించి దాదాపు వెయ్యి అడుగుల ఎత్తునకు పెరుగుచు, అది "చుట్టు ప్రక్కల నున్న ఎత్తైన శిఖరముల నుండి దాదాపు అరవై అడుగులను మించి ఎత్తైనవైయుండి శిఖరమునకు మకుటముగానున్న రెండు మూలపురములతో లేక కొమ్ములతో విశేషముగా గుర్తుపెట్టబడినదై" యున్నది. ఈ కొమ్ములకు నడుమ సువిశాలమైన పచ్చికబయళ్లున్న ఒక స్థలమున్నది. అది చుట్టూ కొండలు ఉండి మధ్యలో రంగస్థలం ఆకారంలో ఉండే స్వాభావికమైన లోయయై యున్నది, అచ్చట ఒకరు మాటలాడుచుండగా వినబడగల మేరలో బహూ గొప్ప జనసమూహము అతి సులభంగా కూడుకొనవచ్చును."[8]

అయియుండవచ్చునని చెప్పుకొనుటకు ఇంత కంటె ఎక్కువ అనువైన చోటు గలిలయ సముద్రమునకు ఉత్తరమున, కపెర్నహోమునకును తబ్‌గాహ్‌కును మధ్య నున్న ఒక కొండయై యున్నది. అది ఈనాడు ధన్యతల కొండయని పిలువబడుచున్నది. ఈ కొండ ప్రక్కన ఒక చిన్న ప్రార్థన మందిరము కట్టబడియున్నది, అది యేసు కొండయెక్కి చేసిన ప్రసంగమునకు చిరస్మరణీయమైన స్మారకమై యున్నది.

ఈ 'కొండమీద ప్రసంగము' ఉపదేశింపబడిన చోటు ఖచ్చితంగా ఎవరికిని ఎరుకలేనప్పటికిని, ముమ్మాటికి అది గలిలయ సముద్రమునకు సమీపములోనే చేయబడినది. ఈ చోటు గూర్చిన వివరము మనకు ఎన్నటికిని తెలియకపోయినప్పటికిని, చెప్పబడిన ఉపదేశములోని విషయము గూర్చి మనము ఎల్లప్పుడు తెలిసికొనవలెనని మత్తయి రూఢిపర్చుకొన్నాడు.

యేసు **ఈ కొండయెక్కి** కూర్చున్నాడు. ఈ విధానము యూదీయ రబ్బీలు ఉపదేశించుచుండిన సాంప్రదాయికమైన తీరై యుండును (13:2; 23:2; 24:3; 26:55). అప్పుడు, **ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చిరి**. యేసు "శిష్యులకును"

**జనసమూహములకును** మధ్య నుండిన సరైన విశదముగా వివరింపబడలేదు. ఈ ఏర్పాటులో జనసమూహములుండిన విషయము యేసు తన ఉపదేశమును ముగించిన తరువాత వారు చూపిన ప్రతిస్పందన ద్వారా మాత్రమే నిశ్చయపర్చబడినది (7:28, 29).

లూకా గ్రంథస్థం చేసిన ప్రసంగము యేసు కొండపై తన పన్నెండు మంది శిష్యులను ఏర్పరచుకొనిన సంఘటన తదుపరి రాయబడి యున్నది (లూకా 6:12-16). వారు యేసుతో కూడ కొండ దిగి "ఆయన శిష్యుల గొప్ప సమూహము"[9] మరియు "యూదయ మరియు యెరూషలేము మరియు తూరు సీదోనుల తీర ప్రాంతము నుండి వచ్చిన బహుజనసమూహము" ఉండిన చోటికి "ఒక మైదానమునకు" వచ్చిరి (లూకా 6:17).

అందరు కూడుకొన్నారు, అప్పుడు యేసు **నోరు తెరచి యిలాగు బోధింపసాగెను.** మత్తయి చేత ఉపయోగింపబడిన భాష అదోక సత్యనిష్ఠతో కూడినదియు గౌరవప్రదమైనదియునైన ఉపన్యాసమై యుండినదని సూచించుచున్నది (అపొస్తలుల కార్యములు 8:35; 10:33, 34 చూడుము). డగ్లస్ ఆర్. ఏ. హేర్ ఇలా వ్యాఖ్యానించాడు, "తన సింహాసనము మీద ఆసీనుడైయున్న ఒక రాజు వలె ఆయన కూర్చున్నాడు, ఆయన శిష్యులు ఆయన యొద్దకు ఆయన చేత పరిపాలింపబడుచుండిన పౌరుల వలె రాచ ప్రాంగణము లోనికి వచ్చిరి, గనుక రాజు తన ప్రారంభోపన్యాసమును వినిపించుచు, ఒకని జీవితము ఆయన రాజ్యములో ఎలాంటిదై యుండునో అందుకు చాలినంత విశదీకరణమును క్రమబద్ధంగా ప్రదర్శించుచున్నాడు."[10]

యేసు పలుకులు క్రొత్త నిబంధన యొక్క "గొప్ప అధికార శాసన పత్రం" అని తరుచుగా పిలువబడుచున్నది.[11] ఈ సూత్రములన్నియును క్రొత్త నిబంధనలో మరోక చోట ఉపదేశింపబడి యున్నవి, గనుక అవి ప్రతి తరములోను జీవించుచున్న క్రైస్తవ విశ్వాసుల కొరకు ఉద్దేశింపబడినవై యున్నవి. ఆయన మాటలు, వాటిని అనుసరించినట్లయితే, అవి ఈ జీవితములో ఒకడు కనుగొనగల అంతిమ ఆనందమునకు నడిపించు ఆదేశములను సమకూర్చును.

## ఆత్మవిషయమై దీనులైనవారు (5:3)

**3ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది.**

**వచనము 3. దీనులైనవారు** అని అర్థమిచ్చు గ్రీకు పదము ఏ దిక్కు దెసయైనను లేనివాడై ఇతరులపై ఆధారపడువాని గూర్చి ప్రయోగింపబడినది. కీర్తనలయందంతటను, దుర్మార్గులైన ధనవంతులు నీతిమంతులైన పేదవారిని అణగద్రొక్కువారిగా చిత్రీకరింప బడియున్నారు; అట్లయినను బాధింపబడుచుండు వీరు దేవుని చేత వారి ఆపదలన్నిటిలో నుండి విడిపింపబడిరి.[12] ఈ విధమైన ఇతివృత్తములు మరియు గానం చేసిన సంకీర్తనములో తారస పడుచు, వినమ్రులును దీనులైనవారిపై దేవుడు కనికరముగలవాడై యున్నాడు కానీ ధనవంతులను ఆయన వట్టిచేతులతో పంపివేయునని అవి తెలియజెప్పును (లూకా 1:46-55). ప్రవచన నెరవేర్పుగా, "బీదలకు సువార్త ప్రకటించుటకై" మరియు "నలిగినవారిని విడిపించుటకు" ఆయన వచ్చాడని యేసు పలికాడు (లూకా 4:18; యెషయా 61:1 చూడుము). క్రొత్త నిబంధన కాలములో, దీనులైనవారు దేవునిపై ఆధారపడునట్లు

తరుమబడుచుండిరి, గనుక నీతిమంతులైన దీనులు, దేవుడు ఒక ప్రత్యేకమైన రీతిలో వారి గూర్చి ప్రత్యేకముగా చింతించుచున్నవారై యున్నారని ప్రవక్తలు మరియు ఇతరుల చేత పరిగణింపబడుచుండిరి.[13] ఈ నేపథ్యమును మనస్సులో ఉంచుకొన్నట్లయితే, లూకా రాసిన సువార్తలో గల ప్రసంగము "దీనులైనవారు" అను పదమును ప్రామాణికము చేయకపోవుట ఆశ్చర్యమును కలిగించనవసరములేదు (లూకా 6:20).

లూకా వలె గాక, **ఆత్మవిషయమై** అను పదజాలమును మత్తయి చేర్చుచున్నాడు. ఆధ్యాత్మిక దారిద్ర్యముచేత పీడింపబడుచున్న పరిస్థితిలో ఉండుట అనగా, ఒకని ఆధ్యాత్మిక అవసరములను తీర్చుటకు తన సొంత వనరులే చాలినవికావని వాడు గుర్తించుచున్నాడని అర్థము. "విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు; దేవా, విరిగినలిగిన హృదయము ..." అని కీర్తనకారుడు రచించాడు (కీర్తనలు 51:17). తానే నీతిమంతుడని అనుకొనుచుండిన పరిసయ్యునికిని, వినయమనస్కుడైన సుంకరికిని గల తారతమ్యమును పోల్చుచు యేసు ఒక ఉపమానము చెప్పాడు. ఇరువురు ప్రార్థన చేయుచున్నారు, పరిసయ్యుడు తనను తానే పొగుడుకొనుచున్నాడు, కానీ సుంకరి, "దేవా, పాపినైన నన్ను కరుణించుము!" అని బిగ్గరిగా కేకవేశాడు (లూకా 18:9–14). ప్రకటన 3:17లో, తామే నీతిమంతులు మరియు స్వయంసమృద్ధులను వైఖరి కలిగియుండినందుకు యేసు లవోదికయలో నున్న క్రైస్తవ విశ్వాసులను తీవ్రముగా దండించాడు. "నీవు దౌర్భాగ్యుడవును దిక్కుమాలిన వాడవును దరిద్రుడవును గ్రుడ్డివాడవును దిగంబరుడవునై యున్నావని యెరుగక, నేను ధనవంతుడను, ధనవృద్ధి చేసియున్నాను, నాకేమి కొదువలేదని" నీవు చెప్పుకొనుచున్నావని పలికాడు.

"ఆత్మ విషయమై దీనులైనవారై" యుండుట, గర్వము మరియు స్వనీతితో నింపబడి యుండుటకు వ్యతిరేకమైన పరిస్థితై యున్నది. అది ఆత్మ విషయమై దీనత్వముగలవారై యుండుటయై యున్నది. ఈ విషయము యేసు నోట నుండి వెలువడిన ధన్యతలలో మొదటి ధన్యతగా వెలువడుచున్నది ఏలయనగా ఇది లేకుండ ఒకడు మిగిలిన జాబితాలో వ్యక్తముచేయబడిన వైఖరులను అంగీకరించలేడు.

"అత్మవిషయమై దీనులైనవారు" **పరలోక రాజ్యమును** కలిగియుందురని యేసు సెలవిచ్చాడు (3:2పై గల వ్యాఖ్యానమును చూడుము). ఆధ్యాత్మికముగా విరిగినలిగిన హృదయముతో దేవుని యొద్దకు వచ్చువారు బాగుచేయబడుదురు. "నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములో నివసించువాడను, అయినను వినయముగలవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును ... నివసించుచున్నానని" దేవుడు ప్రవక్తయైన యెషయా ద్వారా పలికాడు (యెషయా 57:15). వారి జీవితములను ఆయన హస్తగతముచేయువారిని దేవుడు హెచ్చించును. "ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనుడి, అప్పుడాయన మిమ్మును హెచ్చించునని" యాకోబు రచించాడు (4:10; సామెతలు 29:23 చూడుము).

## దుఃఖపడువారు (5:4)

**4దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు.**

**వచనము 4. దుఃఖపడుట** గూర్చిన పదము వేసనమును లేక విచారమును వ్యక్తముచేయు గ్రీకు పదములన్నిటిలోను బహుశా బహు బలమైనదియు అత్యంత గంభీరమైదియునైన

పదమై యుండవచ్చును. ఈ పదము తరుచుగా తమ ప్రియులను కొల్పోయినవారి చేత అనుభవింపబడు శోకమును వర్ణించుటకు ప్రయోగింపబడుచుండును (ఆదికాండము 23:2; 37:34, 35; 50:3 [LXX]; మార్కు 16:10, 11). ఒకనిని గట్టిగా పట్టుకొని వానిని వదలని దుఃఖము ఇటువంటిదే. ఇటువంటి దు: ఖము తరుచుగా అంగలార్చుట ద్వారా, ఏడ్చుట ద్వారా ప్రదర్శింపబడినది. వాస్తవమునకు, "దుఃఖపడుట" మరియు "ఏడ్చుట" అను పదములు పరిశుద్ధ సత్యవేదములో తరుచుగా జంటగా అగుపించుచుండును. ఈ హేతువునుబట్టి, లూకా సువార్తలో లిఖింపబడిన సంబంధిత ధన్యత మామూలుగా "ఏడ్చుచున్న" వారు ధన్యులని చెప్పుట ఆశ్చర్యమును కలిగించదు (లూకా 6:21).

ఏది ఏమైనా, ప్రియులను కొల్పోయినప్పుడు అనుభవించు దుఃఖము గూర్చి యేసు చర్చించుచుండెననునది సందేహమే. స్పష్టముగా, ఈ ధన్యత వెనుక గల నేపథ్యము, మెస్సీయ "దుఃఖపడువారందరిని ఓదార్చునని" ముందుగానే తెలియజెప్పిన యెషయా 61:2 అయియున్నది. ప్రాచీన ఇశ్రాయేలులో అంగలార్చుచుండినవారు వారి ప్రజల పాపములు మరియు తత్పరిణామముగా దేవుని నుండి వచ్చు తీర్పు గూర్చి బాధనొందుచుండిరి. దేవుడేర్పరచుకొనిన జనులపై దుర్మార్గులైన అన్య జనాంగములు జయమొందుట గూర్చిన తలంపుల విషయంలో వారు అత్యంత చింతగలవారై యుండిరి. ఇందుకు ఒక ఉదాహరణము, యెరూషలేము గూర్చి విలపించిన యిర్మీయా (యిర్మీయా 9:1, 18; 13:17; 14:17). విలాపవాక్యముల గ్రంథంలో, యెరూషలేము, దేవుడేర్పరచుకొన్న పరిశుద్ధ పట్టణము, అది చేసిన పాపము వలని శిక్షగా నాశనమైనందునుబట్టి యిర్మీయా విలపించాడు.

ధర్మవర్తనము పదేపదే దుఃఖమును కలుగజేయును. "నీతిమంతుడై లోతు" సొదొమ వారి "అక్రమమైన క్రియల చేత దినదినము" బాధింపబడుచువచ్చును. లోతు జీవించిన అవినీతిమయమైన పరిస్థితులు ఆయన మనస్సును నొప్పించినవి (2 పేతురు 2:6-8). యేసు, "వ్యసనాక్రాంతుడును వ్యాధిననుభవించినవాడును" (యెషయా 53:3), తిరుగుబాటు చేయుచుండిన పట్టణమైన యెరూషలేము వైపు తిరిగి దాని గూర్చి ఏడ్చాడు (లూకా 19:41-44). ఇంతేగాక, యేసును మెస్సీయగా అంగీకరించని తన తోటి యూదుల విషయమై పౌలు దుఃఖించాడు (రోమీయులకు 9:1-3).

నీతిమంతులై దుఃఖపడువారు వారి సొంత పాపములను గూర్చి కూడ విలపింతురు (కీర్తనలు 51:1-4, 7-12). వాని పాపములు దేవుని హృదయమును బ్రద్దలగొట్టునని ఒకడు గ్రహించినప్పుడే, వాడు మార్పునొందుటకు తగినవాడైయుండును. "దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయునని" పౌలు పలికాడు (2 కొరింథీయులకు 7:10; NIV).

అసలు సత్యము ఇది: వారి సొంత పాపములు మరియు ఇతరుల పాపముల గూర్చి దుఃఖపడువారు **ఓదార్చబడుదురు.** నీతిమంతులై దుఃఖపడువారు వారి వ్యక్తిగత పాపములు క్షమింపబడినవనియు ఆయన వారితో కూడ ఉన్నాడనియు ఎరుగుట ద్వారా (11:28-30; 28:18-20; అపొస్తలుల కార్యములు 2:38; 1 యోహాను 1:7, 9) ఈ జీవితంలో దేవుని నుండి లభించు ఓదార్పును పొందుదురు. అంతిమ ఆదరణకరమైన ఓదార్పు రానున్న జీవితంలో అనుభవింపనగును (లూకా 16:25), అప్పుడు "సమస్తమైన ఆదరణను అనుగ్రహించు దేవుడు" (2 కొరింథీయులకు 1:3) "వారి కన్నుల నుండి ప్రతి

బాష్పబిందువును తుడిచివేయును" (ప్రకటన 7:17; 21:4).

## సాత్వికులు (5:5)

**[5]సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు.**

**వచనము 5. సాత్వికము**నకు సరిపడు పదము "నమ్రతగల" అని కూడ అనువదింపబడినది. "సాధు" లేక "మెత్తని" అని దాని ప్రాథమిక అర్థమై యున్నది. ఏది ఏమైనా, "సాత్వికము" మరియు "బలహీనత" ఒకే అర్థమునీయవు. "*Praus*లో సాత్వికము వెనుక ఉక్కుకు ఉన్నంత బలమున్నది ... అది ఒకని అధీనములో నున్న బలమై యున్నది."[14]

"సాత్వికము" అని అర్థమిచ్చు ఆంగ్లపదము కొన్ని పర్యాయములు గౌరవించుటకు తగినవాని కంటె తక్కువైన వానిని, బలహీనుని, నిర్వీర్యమైనవానిని వర్ణించుచున్నప్పటికిని, సాంప్రదాయికమైన గ్రీకులో దాని అర్థము ఇది కాదు. *Praus* గ్రీకు సంస్కృతికి సంబంధించిన గొప్ప నీతులలో ఒకదానికి ప్రతినిధియై యుండినది. ఈ పదమును అనువదించువారు ఎదుర్కొను సందిగ్ధావస్థ గూర్చి విల్యమ్ బార్క్లే వర్ణించాడు. "సాధుత్వము దానికి అత్యంత సమీపముగా నున్న పదమై యున్నప్పటికిని, ఏ ఒక్క ఆంగ్ల పదము ... దానిని అనువదించలేదని" ఆయన చెప్పాడు. ఆ వాక్యభాగమును గూర్చి ఆయన ఈ క్రింది సవిస్తరమైన దండాన్వయమునిచ్చాడు:

> ఆహా, సరైన సమయంలో ఎల్లప్పుడు కోపపడుచు, సమయంకాని సమయంలో ఎన్నడును కోపపడనివాని, వాడే స్వయంగా దేవుని చేత నియంత్రింపబడుచున్నాడు గనుక ప్రతివిధమైన సహజప్రవృత్తిని, సహజాతోద్వేగమును, మరియు ప్రగాఢవాంఛను వాని ఆధీనములో కలిగియున్నవాని, వాని సొంత అజ్ఞానమును మరియు సొంత బలహీనతను అర్థంచేసికొనుటకు వినయము కలిగియున్నవాని మహదానందం ఎంతో అద్భుతకరమైనదై యున్నది, ఏలయనగా ఇటువంటివాడు మానవులలో ఒక రాజైయున్నాడు![15]

అలాగైతే, సాధువైనవాడు, సరైన సందర్భములలో, సరైన సమయంలో కోపము తెచ్చుకొనువాడై యున్నాడు. వాడు వ్యక్తిగత అవమానముల కంటే ఎక్కువగా సమాజములో చోటుచేసికొనుచున్న అన్యాయముల గూర్చి అధిక చింతగలవాడై యున్నాడు. ఇటువంటి వారిని బలహీనులుగా లేదా భద్రతలేనివారిగా పరిగణించుటకు బదులుగా, మనము విల్యమ్ బార్క్లేతో ఏకీభవించుచు, "ఆత్మనియంత్రణ యను వరము కలిగియుండినవారు, ప్రగాఢావేశాలు, మరియు సహజ ప్రవృత్తులు, మరియు క్రమశిక్షణలో నుండిన ప్రేరణలు కలిగియుండినవారు, ఎల్లప్పుడు గొప్పవారై యుండిరనునది చరిత్ర చెప్పుచున్న సత్యమైయున్నదని" పలుకవలెను.[16]

మోషే మరియు యేసును వర్ణించుటకు *praus* [సాత్వికుడు] అను పదము ప్రయోగింపబడుచున్నది. "మోషే భూమి మీద నున్నవారందరిలో మిక్కిలి సాత్వికుడని [*praus*; LXX]" సంఖ్యాకాండము 12:3 సెలవిచ్చుచున్నది. తనను గూర్చి తానే వర్ణించుకొనుచు, ఆయన "సాత్వికుడును [*praus*] దీనమనస్సు గలవాడునై యున్నాడని" యేసు చెప్పాడు (11:29; 21:5 చూడుము). ఈ ఇరువురిలో ఏ ఒక్కరైనను బలహీనులై యుండలేదు. వారు బహు బలము మరియు సామార్థ్యముగలవారై యుండిరి, కానీ వారికి దేవుడనుగ్రహించిన

పాత్రలను వారు దాసుని వైఖరులు మరియు జ్ఞానముతో నింపుకొన్నారు. "యేసు తన మెస్సీయ సంబంధిత పరిచర్యను నిర్వహించి, బలవంతముగా ఒక రాజకీయ రాజ్యమును వ్యవస్థాపింపవలెననెడు జోలేతే తాత్పర్యముగలవానివలె కాదు, కానీ వినయము మరియు దేవుని యెడలను తోటి మానవుల యెడలను త్యాగపూరిత సేవాదృక్పథముగల జీవితము జీవించినవాని వలె దానిని పూర్తిచేశాడు."[17]

సాత్వికులు **భూలోకమును స్వతంత్రించుకొందురని** యేసు సెలవిచ్చినప్పుడు ఆయన భావమేమైయుండినది? ఈ ప్రశ్నకు సమాధానమివ్వగలుగునట్లు ప్రయత్నించుటకు ముందు, రెండు ముఖ్యమైన వాస్తవములు తప్పక గుర్తింపబడవలసి యున్నది. మొదటిది, "భూలోకము" అను పదము "భూమి" అని కూడ అనువదింపబడవచ్చును. రెండవది, ఈ ధన్యత వాస్తవమునకు కీర్తనలు 37:11 (36:11; LXX) యొక్క ఒక ఉల్లేఖనమై యున్నది: "దీనులు భూమిని స్వతంత్రించుకొందురు గనుక బహు క్షేమము కలిగి సుఖించెదరు." (NIV) కీర్తనలు 37 దుర్మార్గులకును నీతిమంతులకును మధ్య ఒక తారతమ్యమును స్థాపించుచున్నది. "వాగ్దాన దేశము [కనాను] యొక్క ఆశీర్వాదములను అనుభవించువారెవరు?" అను ప్రశ్నకు అది సమాధానమిచ్చుచున్నది. కుయుక్తితో కూడిన ప్రణాళికలువేయు దుర్మార్గులు భూమి మీద కనబడకపోవుదురు, అయితే నీతిమంతులు మరియు ప్రభువునందు విశ్వసించిన వారి సంతానము భూమి మీద నిలుచును (యెషయా 61:7 చూడుము).

యేసు తిరిగి వచ్చినప్పుడు ఆయన తన రాజ్యమును భూమి మీద ఏర్పాటుచేయునని తెలియజెప్పు వెయ్యేండ్ల పరిపాలనకు ముందటి సిద్ధాంతమునకు ఈ వాగ్దానము ఊతనిచ్చుట లేదు. ఆయన ఉపదేశములు మరియు బోధలు వినిన కొందరి ప్రజల జీవితకాలములో ఆయన రాజ్యము వచ్చేయున్నది (మార్కు 9:1; యోహాను 18:36; అపొస్తలుల కార్యములు 1:6–8 చూడుము). యుగాంతమందు క్రైస్తవులు స్వతంత్రించుకొను "నూతన ఆకాశములు" మరియు "నూతన భూమి"ని కొంత మేరకు సూచించుచున్నదను అవగాహనతో మాత్రమే ఈ ధన్యత యుగాంత సిద్ధాంతముగా దృష్టింపబడవలెను (2 పేతురు 3:13; ప్రకటన 21:1). ఇంకా ప్రస్తుతకాలమందున్న ఈ భూమిపై, క్రీస్తుకు చెందినవారు, ఆయన వారికి సమకూర్చు ఆశీర్వాదములను అనుభవించుటకు గొప్ప సామర్థ్యమును కలిగియున్నారను సత్యమును సహితము అది సూచించవలెను (1 కొరింథీయులకు 3:21–23 చూడుము) ఇందునిమిత్తము రాబర్ట్ హెచ్. మౌన్స్ మాటలను ఉపయోగించుకొనవచ్చును, "కలహప్రియులంతా వారి అన్యాయార్జిత లాభాలను ఆనందంగా అనుభవించుటకు అసమర్థులైపోయారు. యథార్థమైనవై చిరకాలము నిలిచియుండు సంతృప్తిని సమకూర్చు ఆయా విషయాలన్నింటిని వారి జీవితంలో ఆనందంగా అనుభవించు సమర్థతను సాత్వికులు మాత్రమే కలిగియున్నారు."[18] జేమ్స్ మెక్‌గిల్ ఈ క్రింది వివరము రచించాడు,

> ఐహిక ఆస్తుల పౌర అధికార పత్రములు ఎవరి ఆధీనములో ఉన్నదను విషయముతో నిమిత్తము లేకుండా, ఈ ప్రపంచమంతా మన తండ్రిదై యున్నది, సాత్వికులు ఆయన సంతానమునకు వారసులునై యున్నారు ...
>
> సాత్వికులు వంద రెట్ల దీవెనలతో ఈ భూలోకమును, ఈ జీవితమును – వాస్తవముగా సమృద్ధియైన జీవితము – మరియు రానున్న లోకములో, నిత్యజీవితమును ఆనందంగా అనుభవించుదురు! (మార్కు 10:30).[19]

## నీతి కొరకు ఆకలిదప్పులుగలవారు (5:6)

**[6]నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు.**

**వచనము 6.** మానవులు కలిగియున్న కోరికలలో **ఆకలి మరియు దాహము** బహుశా అత్యంత బలమైనవి అతి తరుచైన శారీరిక కోరికలై యుండును. ఏదిఏమైనా, అధునిక ప్రపంచంలో ఆహారము మరియు నీళ్లు తక్షణమే అందుబాటులో నున్నవారికి తీవ్రమైన ఆకలి మరియు దాహము అన్య విషయాలై యున్నవి. ఆకలిగొనుట అంటే ఏమిటో యేసుకు ఎరుకే, ఏలయనగా ఆయన నలువది దినములు నలువది రాత్రులు అరణ్యములో ఉపవాసమున్నాడు (4:2పై గల వ్యాఖ్యానమును చూడుము). ఆసక్తికరంగా, లూకా రాసిన సువార్తలో గల ప్రసంగములో, "ఇప్పుడు ఆకలిగొనుచున్న మీరు ధన్యులు, మీరు తృప్తిపరచబడుదురు" అని సామాన్యమైన రీతిలో రాయబడియున్నది (లూకా 6:21) నిశ్చయంగా, దేవుని యెడల వారు కలిగియుండిన నిబద్ధత కారణంగా, జీవితంలోని ప్రాథమిక అవసరములేమీ లేకుండా కాలము గడిపినవారుండిరి (2 కొరింథీయులకు 6:5; 11:27; ప్రకటన 7:16).

మత్తయి రాసిన సువార్తలో, **నీతి కొరకు** అను విశేషణాంశ పదజాలమును ప్రయోగించుట ద్వారా యేసు ఆధ్యాత్మిక కోరికల విషయంలో ఆకలిదప్పులతో ఉండుట గూర్చిన ఆలోచనను అన్వయించాడు. ఇటువంటి మనోకల్పనకు కీర్తనలలో ఒక నేపథ్యమున్నది:

> దుప్పి నీటివాగుల కొరకు ఆశపడునట్లు
> దేవా, నీ కొరకు నా ప్రాణము ఆశపడుచున్నది.
> నా ప్రాణము దేవునికొరకు తృష్ణగొనుచున్నది
> జీవము గల దేవునికొరకు తృష్ణగొనుచున్నది,
> దేవుని సన్నిధికి నేనేప్పుడు వచ్చెదను?
> ఆయన సన్నిధిని నేనెప్పుడు కనబడెదను?
> (కీర్తనలు 42:1, 2).
>
> దేవా, నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదకుదును
> … నీళ్లు లేక యెండి యున్న దేశమందు
> నా ప్రాణము నీ కొరకు తృష్ణగొనుచున్నది,
> నీ మీది ఆశచేత నిన్ను చూడవలెనని నా శరీరము కృశించుచున్నది
> (కీర్తనలు 63:1, 2)

అధ్యాత్మిక ఆకలి మరియు దాహము గూర్చిన విషయము యెషయా గ్రంథంలో కూడ కలదు:

> దప్పిగొనినవారలారా, నీళ్ల యొద్దకు రండి
> రూకలులేనివారలారా, మీరు వచ్చి కొని భోజనము చేయుడి.
> రండి, రూకలు లేకపోయినను ఏమియు నియ్యకయే ద్రాక్షారసమును పాలను కొనుడి.
> ఆహారము కానిదాని కొరకు మీరేల రూకలిచ్చెదరు?
> సంతుష్టి కలుగజేయని దాని కొరకు మీ కష్టార్జితమును ఎందుకు వ్యయపరచెదరు?
> నా మాట జాగ్రత్తగా ఆలకించి, మంచి పదార్థము భుజించుడి
> మీ ప్రాణము సారమైనదానియందు సుఖింపనియ్యుడి.
> (యెషయా 55:1, 2).

ఈ ఆధ్యాత్మిక ఆకలిని యేసు తన ఇహలోక జీవితంలో ప్రదర్శించాడు. ఆయన రాళ్లను రొట్టెలగునట్లు ఆజ్ఞాపింపవలెనని సాతాను ఆయనను శోధించినప్పుడు, "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదు గాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాటవలన జీవించునని" ఆయన ప్రత్యుత్తరమిచ్చాడు (4:4). యాకోబు బావి యొద్ద, సమరయలోని సుఖారను పట్టణములోనికి ఆహారము కొనుటకు వెళ్లిన యేసు శిష్యులు తిరిగి వచ్చినప్పుడు ఆహారము ఆరగించుటకు ఆయన నిరాకరించినందుకు వారు అబ్బురపడిరి. "భుజించుటకు మీకు తెలియని ఆహారము నాకు ఉన్నదనియు" "నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదిముట్టించుటయు నాకు ఆహారమై యున్నదనియు" ఆయన తన శిష్యులతో చెప్పాడు (యోహాను 4:32, 34).

ఈ ధన్యత, కనీసము కొంతవరకైనా, "నీతి" అనగా యేసు భావమేమిటో నిర్వచించుట ద్వారా అనువదింపబడవలెను. యేసు ఉపయోగించిన పదమును "న్యాయము," "నైతిక న్యాయవర్తనము," లేక "దేవుని యెదుట సరైన స్థానములో నుండుట" అని అర్థంచేసికొనవచ్చును. న్యాయమునకు సంబంధించినంత వరకు, అణగద్రొక్కబడుచు పీడింపబడువారికి ఈ ధన్యత ప్రోత్సాహము నిచ్చుచున్నది అని డోనాల్డ్ ఏ. హేగ్నర్ సూచించాడు.[20] ఈ నీతి, నైతికి న్యాయవర్తనముతోసంబంధము కలిగియున్నదను సంగతిని లియోన్ మోర్రిస్ చెప్పాడు. ఇంకా "ప్రతి ఒక్కరు అప్పుడప్పుడు సరైనదే చేస్తారు, కానీ ఆయన బోధలు వినుచుండినవారు వారి ప్రగాఢ తాపత్రయమంతటిని సరైన సంగతులపై కేంద్రీకరించవలెనని యేసు వారికి ఉపదేశించుచుండెనని" మోర్రిస్ రచించాడు.[21] దేవుని జనులందరును లోపభూయిష్టమైనవారును పాపిష్టియైన వారునై యున్నారు గనుక, వారు దేవునితో కూడ సరైన పరపతి కలిగియుండుటకు వారు దేవుని కృపపై ఆధారపడవలసినదే.

యేసు అనుచరులు మొత్తంగా సువిశాలమైన నీతియై యుండు నీతిని ఆశించు చుండవలెనని ఈ వచనము గ్రీకు భాషలో రాయబడిన తీరు సూచించుచున్నది. నీతి అనగా దేవుని దృష్టికి సరైన జీవితము జీవించుట యని నిర్వచింపబడిన నీతి ఒక ఐచ్ఛికమైన ఆధ్యాత్మిక అవశ్యకతయై యున్నది. గనుక ఇటువంటి నీతిని వెదకుటకు యేసు క్రీస్తును వెంబడించు ఏ ఒక్కరును తనను తాను మన్నించుకొనకూడదు. అతడు దాని అణువణువును అతురతతో ఆకాంక్షించును.[22]

ప్రగాఢ వాంఛతో దేవుని వెదకుచుండువారు తృప్తిపరచబడుదురను వాగ్దానము వారికియ్యబడినది. దేవుడు వారి హృదయవాంఛనలను తీర్చునని ఆయన వాగ్దానమిచ్చియున్నాడు. ఇక్కడ ప్రయోగింపబడిన భాష కీర్తనలు 107:9 యొక్క గత జ్ఞాపకాలై యున్నది: "ఏలయనగా ఆశగల ప్రాణమును ఆయన తృప్తిపరచి యున్నాడు, ఆకలిగొనినవారి ప్రాణమును మేలుతో నింపియున్నాడు" (యిర్మీయా 31:24, 25; లూకా 1:53 చూడుము). దేవుడు తన ప్రజల గంభీరమైన అభ్యుదయేచ్ఛలను, భౌతికపరంగాను మరియు ఆధ్యాత్మికంగాను, తృప్తిపరచుటకు సమర్థుడై యున్నాడు. స్పష్టంగా, ఈ ఆధ్యాత్మిక సంతృప్తి ప్రస్తుత యుగములో ప్రాప్తించగలదు. యేసు "జీవాహారము నేనే; నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు, నా యందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడని" చెప్పాడు (యోహాను 6:35). ఇంకా, ఈ ఆధ్యాత్మిక నింపుదల రానున్న యుగములో కూడ ప్రాప్తించును, గనుక ఈ నింపుదల ఒక గొప్ప పెండ్లి విందుగా చిత్రీకరింపబడినది (8:11,

12; 22:1-10; 25:10; ప్రకటన 19:9). పరలోక పట్టణమందు, ఒకని దాహము జీవజలములతో తీర్చబడుతోంది, అట్టి జీవజలమును వాడు ఉచితముగా పొందవచ్చును (ప్రకటన 21:6; 22:17).

## కనికరముగలవారు (5:7)

**[7]కనికరముగలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు.**

**వచనము 7.** గ్రీకు పదము నుండి ఉత్పన్నమగుచున్న **కనికరము** "సహానుభూతి" అని కూడ అనువదింపబడవచ్చును. "కనికరము" అని అనువదింపబడిన దానికి సంబంధించిన పదము అనుభూతిచెంది మరొక వ్యక్తి యెడల పరోపకారియై యుండుట ద్వారా తనకున్న అత్యున్నతమమైన ఆసక్తిని కనుపర్చుటకు వెదకుచుండుటను తెలుపుతుంది. ఈ పదము ఇతరుల గూర్చి కేవలము విచారపడుటను మించినదై యున్నది; నీవు కనికరము కలిగియున్నావని కనుపర్చుటకు ఎదుటి వ్యక్తి యెడల నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టవలసిన అవసరమున్నది. అది "అవతలి వ్యక్తి అనుభవించుచున్న బాధను అతని స్థానములో నిన్ను నీవు ఉంచుకొని ఆ బాధను అనుభవించుచు అతని యెడల జాలిపడుటయై" యున్నది, అది కేవలము "సహానుభూతి" కలిగియుండుట మాత్రమే కాదు.

కనికరము గూర్చి యేసు చేసిన ఉపదేశము క్రొత్త నిబంధన ప్రపంచము యొక్క జీవిత విధాన నమూనాకు వ్యతిరేకముగా ఉండినది. రోమీయులు కనికరము చూపుటను అసహ్యించుకొన్నారు గనుక అదొక ఆత్మ రుగ్మతయని ఎంచుటలో వారు ప్రసిద్ధమైనవారై యుండిరి. కనికరము ఒకని బలహీనతకు సంకేతమై యున్నదని ఎంచారు, గనుక మానవ దౌర్బల్యములన్నిటిలోకెల్లా కనికరమును అతిగా అసహ్యించుకొన్నారు. వారు మగతనమును గూర్చి అతిశయించారు, గనుక కనికరమును ప్రదర్శించువానిని మగతనము లేనివానిగా పరిగణించారు.[23]

యేసు కాలములో నుండిన యూదీయ మత నాయకులు తరుచుగా కనికర శూన్యమైనవారై యుండిరి. వారు స్వనీతిపరులు, అహంకారులు, గర్విష్టులు, మరియు ఇతరులను అతిగా విమర్శించువారునై యుండిరి. వేదాంతపరమైన ప్రతి ప్రశ్నకు వారి యొద్ద సమాధానమున్నదని వారనుకొనుచుండిరి, కానీ బాధలనుభవించుచుండినవారి యెడల చూపింపబడవలసిన కనికరము వారిలో లేశమాత్రమైనా లేదు. శ్రమలనుభవించుట ఒకడు చేసిన పాపమునకు దేవుని నుండి కలుగుచున్న శిక్షయని భావించారు (లూకా 13:1-5; యోహాను 9:1, 13, 34 చూడుము). గమలీయేలు, పౌలు యొక్క ప్రధానోపాధ్యాయుడు, "ఇతరుల యెడల కనికరముగలవారు ధన్యులు, వారు పరలోకము నుండి కనికరము పొందుదురు, ఇతరుల యెడల కనికరములేనివారికి, పరలోకము కూడ కనికరము చూపదని" పలికినట్లు టాల్ముడ్‌లో పేర్కొనబడియున్నది.[24] అనేకులైన తన సమకాలికులవలె గాక, ఆయన కనికరము గూర్చి ఒక సరైన దృష్టికోణము కలిగియుండెను.

దేవుని (నిర్గమకాండము 34:6; లూకా 6:36) మరియు యేసు క్రీస్తు యొక్క (హెబ్రీయులకు 2:17) గొప్ప గుణగణములలో కనికరము ఒకటై యున్నది. "ధర్మశాస్త్రములోని ప్రధానమైన విషయములలో" కనికరము ఒకటని యేసు గుర్తించాడు (23:23; 9:13;

12:7 చూడుము). యేసు పలికిన ఈ ధన్యత సామెతలు 14:21లో రాయబడియున్న సత్యమును ప్రతిబింబించుచున్నది: "బీదలను కటాక్షించువాడు ధన్యుడు" (LXX). కనికరము గూర్చిన ఇతివృతము "కనికరము" అను పదము నిర్దిష్టిముగా పేర్కొనబడినప్పటికిని, అది మత్తయి రాసిన సువార్తయందంతటను వ్యాపించియున్నది. రాబర్ట్ హెచ్. గుండ్రి ఈ జాబితానిచ్చాడు:

> మరియను అవమానపరచనొల్లకపోవుట ద్వారా యోసేపు ఆమె యెడల కనికరము కనుపర్చుచున్నాడు (1:19); భర్త తన భార్యకు విడాకులివ్వకుండుట ద్వారా ఆమె యెడల కనికరము కనుపర్చవలసినవాడై యుండును (5:31–32 ...); క్షమాపణ కనికరముతో కూడిన ఒక కార్యమని అప్పులు అచ్చియుండినవారి గూర్చిన ఉపమానము వర్ణించుచున్నది (18:23–35); ఒక్క గంట మాత్రమే పనిచేసిన కూలివారికి దినమంతటి కూలి చెల్లించుట కూడ ఇటువంటి చర్యయే (20:1–16); "చిన్న బిడ్డలు" (అధ్యాయము 18), దేవాలయములోని పిల్లలు, అంధులు, మరియు కుంటివారు (21:14–16), మరియు సుంకరులు మరియు వేశ్యల గూర్చి (21:28–32) యేసు కలిగియుండిన శ్రద్ధ కనికరమును ప్రదర్శించుచున్నది; మరియు అంత్యదిన తీర్పు కనికరముగల కార్యములు గొఱ్ఱెలను మరియు మేకలను విలక్షణముగా గుర్తించుచున్నది (25:31–46).[25]

ఇతరుల యెడల కనికరము చూపించువారు తామే **కనికరము పొందుదురని** యేసు సెలవిచ్చాడు. "మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయినయెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడని" ఆయన అటుతరువాత నేర్పించాడు (6:15). కనికరము కనుపర్చుటలో మనము విఫలులమైనట్లయితే, మన సొంత క్షమాపణకే మనము ద్వారములను మూసివేసికొనుచున్నవారమౌదుము. "కనికరము చూపనివాడు కనికరములేని తీర్పు పొందును; కనికరము తీర్పును మించి అతిశయపడునని" యాకోబు రచించాడు (యాకోబు 2:13). దేవుడు మన యెడల కలిగియున్న ప్రేమ మరియు కనికరమునుబట్టియే, ఆయన మన పాపములను క్షమించుటకు సిద్ధమనస్సుగలవాడై యున్నాడని ప్రదర్శించుటకు ఇష్టపడుచున్నాడు. ఆయన కనుపరచు కనికరము ఆయన యొక్క కృప చొప్పున, మనము అర్హులముకాని క్షమాపణను మనకు అనుగ్రహించుచున్నాడు. "కనికరము (వ్యాధి) లక్షణములతో వ్యవహరిస్తోంది, కానీ కృప దాని మూలకారణంతో వ్యవహరించి నయం చేస్తుంది. కనికరము, శిక్ష నుండి ఉపశమనము కలుగజేస్తుంది; కృప, చేయబడిన నేరమును క్షమిస్తుంది. కనికరము, భాదను తొలగిస్తుంది; కృప, వ్యాధిని బాగుచేయును."[26] "కృప మన పాపపుస్థితికి ఆయన ప్రతిస్పందనయై యున్నది; కనికరము మన వ్యసనములకు ఆయన ప్రతిస్పందనయై యున్నదని " రచించుటలో Haddon W. Robinson సరైన మాటలనే రచించాడు.[27]

## హృదయ శుద్ధిగలవారు (5:8)

**8హృదయ శుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు.**

**వచనము 8. శుద్ధము** అని అర్థమిచ్చు గ్రీకు పదము, క్రొత్త నిబంధనలో ఇరువది ఏడు పర్యాయములు అగుపించుచున్నది. ఈ పదమును NASB సర్వసాధారణంగా "శుద్ధమైన" లేక "శుభ్రమైన" అని అనువదించుచున్నది. **హృదయము** ఒకని అనుభూతులు, ఆలోచనలు,

మరియు చిత్తవృత్తిని కలుపుకొని, అతని అంతరంగములోని స్వయం కేంద్రమును సూచించుచున్నది. ఈ ధన్యత యేసు క్రీస్తును వెంబడించువారి అంతరంగ శుద్ధి గూర్చి మాట లాడుచున్నది, శాస్త్రులు మరియు పరిసయ్యులు అభ్యసించుచుండిన ఆచార కర్మకాండలకు సంబంధించిన బాహ్య శుభ్రత దీనికి భిన్నముగా నున్నది (15:1–11; 23:25–28 చూడుము). శుద్ధమైన హృదయము సరైన జీవిత విధానమంతటికిని మూలాధారము మరియు మూలమునై యున్నది. అది లేకుండా, సరైన చర్యలు సహితము అర్థరహితమైన ఆచారకర్మకాండలుగా మారిపోవును (12:34; 15:19 చూడుము). మైఖేల్ జే. విల్కిన్స్ దీని అగత్యము యొక్క సారాంశమును ఇలా రచించాడు:

> యూదా మత బోధకులు మతపరమైన కృతువుల శుద్ధీకరణము సక్రమంగా నిర్వహింపబడు నిమిత్తము కొన్ని నియమ నిబంధనలతో కూడిన ఒక జటిలమైన విధానమును అభివృద్ధిచేయుచుండిరి, అది తోహారొత్ (*Tohoroth* - "శుద్ధమైన") అటుతరువాత కలుపుకొన్నది, ఇది మిష్నాలోని విభాగములలో ఒక్కటై యున్నది. కానీ ఆ నియమ నిబంధనలన్నియును అన్నింటికి సంబంధించిన అత్యంత ప్రాముఖ్యమైన పవిత్రత హృదయశుద్ధిని కలుగజేయదు ... శుద్ధమైన హృదయము, దేవుని యెడల ఏకాగ్రతగల మనస్సుతో కూడిన రాజభక్తి వాని జీవితములోని ప్రతి అంశమును ప్రభావితము చేసినవానిని వర్ణిస్తుంది.[28]

యేసు సెలవిచ్చిన ధన్యత కీర్తనలలో వర్ణింపబడిన ఆరాధన మార్గమును ప్రతిధ్వనించుచున్నది:

> యెహోవా పర్వతమునకు ఎక్కదగినవాడెవడు?
> ఆయన పరిశుద్ధ స్థలములో నిలువదగినవాడెవడు?
> వ్యర్థమైనదానియందు మనస్సు పెట్టకయు
> కపటముగా ప్రమాణము చేయకయు
> నిర్దోషమైన చేతులును శుద్ధమైన హృదయమును
> కలిగియుండువాడే (కీర్తనలు 24:3, 4).

కీర్తనకారుడు ఈ క్రింది విధంగా కూడా ప్రార్థించాడు,

> దేవా, నాయందు శుద్ధ హృదయము కలుగజేయుము
> నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము.
> నీ సన్నిధిలో నుండి నన్ను త్రోసివేయకుము
> నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము
> (కీర్తనలు 51:10, 11).

"హృదయశుద్ధిగలవారు" మాత్రమే **దేవుని చూచెదరు.** ఈ సందర్భములో, "చూచుట" అను క్రియాపదము మామూలు మానవ నేత్రములతో చూచుటను మించినదై యున్నది. చూచుట అనగా దేవుని అనుభవించుట, దేవుని గూర్చి ఆనందానుభూతి చెందుట, మరియు దేవుని ఎరుగుట యని అర్థము. ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదని విషయం నిజమే (నిర్గమకాండము 33:20; యోహాను 1:18; 1 తిమోతి 6:16). ఏదిఏమైనా, ఆయనను భౌతికంగా చూడకుండా, విశ్వాసమను కనుచూపుతో వర్తమాన కాలమందు క్రైస్తవులు దేవుని అనుభవించుచున్నారనుటలో, ఒక అర్థమున్నది (కీర్తనలు 63:2; హెబ్రీయులకు

11:27). అట్లయినప్పటికని, ఏదో ఒక దినాన ఆ విశ్వాసము నిజరూపముగా మారుతుంది (2 కొరింథీయులకు 5:7 చూడుము), గనుక క్రైస్తవులు ఆయనను "ముఖాముఖిగా" చూచెదరు (1 కొరింథీయులకు 13:12; 1 యెహాను 3:2 చూడుము). పరలోక పట్టణమందు, దేవుడు తన ప్రజల మధ్య నివసించును (ప్రకటన 21:3) గనుక "వారు ఆయన ముఖదర్శనము చేయుచుందురు" (ప్రకటన 22:4).

### సమాధానపరచువారు (5:9)

**[9]సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు.**

**వచనము 9. సమాధానపరచువారు** అను మాటకు ఆధారంగా నున్న గ్రీకు పదము క్రొత్త నిబంధన అంతటిలో ఇచ్చట మాత్రమే అగుపించుచున్నది. ఈ పదము "గుసగుసలాడువానికి, అనవసరంగా జోక్యము కలుగజేసుకొనువానికి, అధికప్రసంగికి, అదేపనిగా వాగుచుండెడువానికి, తుంటరి పనులుచేయువానికి వ్యతిరేకముగా నున్న ఒక వైఖరిని వర్ణించుచున్నదని" లూయిస్ చెప్పాడు.[29]

"సమాధానము"నకు సంబంధించిన గ్రీకు పదముల రూపములు క్రొత్త నిబంధనలో తొంబది పర్యాయముల కంటె ఎక్కువగా ప్రయోగింపబడినవి మరియు దాదాపుగా క్రొత్త నిబంధనలోని ప్రతి పుస్తకములో ఈ పదము అగుపించును "సమాధానము"నకు సమానార్థమిచ్చు హెబ్రీ పదము షాలోమ్ (*shalom*) యొక్క అర్థము ఘర్షణ లేకపోవుటను మించినదై యున్నది; ఇతరులకు మేలు కలుగవలెనను నిర్మాణాత్మకమైన కోరిక కలిగియుండుట దానిలో కలిసియున్నది. హేర్ ఈ పదమును దాని సంస్కృతి దృష్ట్యా దానిని సముచితమైన స్థానంలో సార్థకంగా ఉంచాడు:

> ఈ ధన్యత మొదట రోమా సామ్రాజ్యములోని వివిధ దేశాలు మధ్య సమాధానము నెలకొనియుండిన కాలములో [Roman Peace] ఉచ్చరింపబడినదనునది గమనార్హమైనది. రోమా ప్రభుత్వ సైనిక ఆధిక్యత తాకిడి వలన పోటిపడుచుండిన కక్షిదారు రాష్ట్రముల మధ్య జరుగుచుండిన చిన్న చిన్న యుద్ధములను వారు అంతమొందించారు, మధ్యధరా సముద్రములోని సముద్రపు దొంగల ముఠాలను నిర్మూలించారు, దేశ భూభాగములో జరుగుచుండిన దోపిడిదొంగతనాలను బహూ గొప్పగా తగ్గించారు. ప్రక్క దేశాలతో నున్న సరిహద్దు ప్రాంతములు మినహాయిస్తే, యుద్ధములు దాదాపుగా అన్నీ ఆగిపోయాయి. కానీ హెబ్రీయుల అవగాహన ప్రకారమైన సమాధానము, *షాలోమ్*, సమస్త ప్రజల సంక్షేమము కొరకు పాటుపడుటకుద్దేశింపబడిన సామరస్య సహితమైన సహకారము, రోమా సామ్రాజ్య సైనిక దళముల చేత స్థాపింపబడలేకపోయినది.[30]

మొదటి శతాబ్దము నాటి పాలస్తీనా దేశము గూర్చిన చారిత్రాత్మక ఏర్పాటును మనస్సులో ఉంచుకొని, ఈ ధన్యత జెలోతీయులైనవారి గూర్చి (మతపరంగా అత్యుత్సాహకులు) వ్యతిరేక ఉద్దేశముతో ఉచ్చరింపబడినదని హేగ్నర్ సూచించుచున్నాడు. దౌర్జన్యముతోనైనా సరే, రోమా సామ్రాజ్య నిర్దాక్షిణ్యమైన హింసకులను పడద్రోసి ఇశ్రాయేలు రాజ్యమును పునఃస్థాపింపవలెనని యూదులైన ఈ విప్లవకారులు ఆశించారు (యోహాను 6:15 చూడుము). "జెలోతీయులు, వారే 'దేవుని యెడల రాజభక్తిగల కుమారులైయున్నారని' వారి సైనిక తత్త్వమునుబట్టి

ప్రదర్శించుటకు మరి ఎక్కువగా నిరీక్షించారని” ఆయన చెప్పాడు. ఏదిఏమైనా, దేవుని రాజ్యము ఆ విధానములో రాదని యేసు ఉపదేశించాడు. దానికి బదులుగా, దేవుని రాజ్యము దైవికమైన చొరవతో వచ్చును, గనుక సమాధానమునకు ప్రోత్సాహమిచ్చువారు ఆయన రాజ్య పౌరులై యుందురు.[31]

యేసు అనుచరులు సమాధానము గూర్చి కేవలము ఆలోచించుట మరియు మాట లాడుటను మించిన పనులు చేయవలసి యున్నది. యేసు, “సమాధానమును ప్రేమించువారు ధన్యులు” అని గాని, “సమాధానము కొరకు నిరీక్షించువారు ధన్యులు” అని గాని పలుకలేదు. ఆయన శిష్యులు సమాధానము లేని చోట సమాధానము కలుగుననిగాని, వారు దేవుని కుమారులనబడుదురనిగాని ఈ ధన్యత వాగ్దానమిచ్చుటలేదు. దానికి బదులుగా, వారి భేదాభిప్రాయములను ఎదుర్కొనుచు వాటిని జయించువారికి నిజమైన సంతోషము, సమాధానము కలుగుతుంది. సమాధానపరచుటకు సంబంధించిన దీని గూర్చి బార్క్లే ఇలా చెప్పుచున్నాడు:

> మనము ఏ విషయముల గూర్చైనా ఏమి చేస్తామో ఏమో అని మనము భయపడుచున్నాము గనుక ఏ విషయమునైనను నిశ్చలముగా అంగీకరింపవలెనని ఈ ధన్యత కోరుటలేదు, కానీ విషయాలను క్రియాశీలకంగా ఎదుర్కొనుచు, సమాధానమును ఎంతో ప్రయాసతో స్థాపింపవలసి వచ్చినప్పటికిని, సమాధానమును కలుగజేయవలెనని సాధికారముతో కొరుచున్నది.[32]

సమాధానమునకు ప్రోత్సాహకమిచ్చువారు దేవుని కుమారులనబడుదురని యేసు చెప్పాడు. సమాధానముపరచు సర్వోచ్ఛమైనవాడు దేవుడే, మానవాళి మరలా తన సహవాసములోనికి ఆకర్షించుకొనునట్లు ఆయన తన అద్వితీయకుమారుని బల్యర్పణగా అర్పించాడు (రోమీయులకు 5:1–11; ఎఫెసీయులకు 2:11–22). ఆయన “సమాధానమునకు దేవుడై” యున్నాడు (ఫిలిప్పీయులకు 4:9; 1 థెస్సలొనీకయులకు 5:23). సమాధానపరచువారు “దేవుని కుమారులనబడుదురు” ఏలయనగా వారు ఆయన స్వభావములో పాలుపంచుకొనుచున్నారనియు విశ్వాసనీయమైన విశ్వాసులను దేవుడు ప్రస్తుతమందు తన “కుమారులనుగా” పిలుచుచున్నాడను అవగాహన ఉంటున్నది (రోమీయులకు 8:14; గలతీయులకు 3:26, 27), సరికదా, సమాధానపరచువారు ఆయన కుమారులై యున్నారని అంత్యదిన తీర్పు సమయంలో కూడ ఆయన ఆమోదించును.

## హింసింపబడువారు (5:10–12)

**10నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోకరాజ్యము వారిది.**

**11నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. 12సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును. ఈలాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి.**

మత్తయి 5:3–12లో “ధన్యులు” అను మాట తొమ్మిదిసార్లు అగుపించుచున్నప్పటికిని. మరియు సాంకేతికంగా తొమ్మిది ధన్యతలున్నప్పటికిని, ఎనిమిదవ ధన్యత (5:10) మరియు తొమ్మిదవ ధన్యత (5:11, 12) కలుపబడి యున్నవి ఏలయనగా అవి రెండు కూడ హింసకు

సంబంధించినవై యున్నవి. మొదటి ఎనిమిది ధన్యతలు ప్రథమ పురుషలో ఉన్నవి ("వారు"), కానీ తొమ్మిదవ ధన్యత మధ్యమ పురుషగా మారుచున్నది ("మీరు"). బహుశా యేసు మొదటి ఎనిమిది ధన్యతలను కూడుకొనియుండిన జనసమూహము నుద్దేశించి పలికిన తదుపరి తొమ్మిదవ ధన్యతను తన శిష్యుల నుద్దేశించి పలికియుండును.[33] ఉప్పు మరియు వెలుగుగా తన శిష్యుల పాత్ర ఏమైయుండినదో యేసు చర్చించుచుండినప్పుడు ఆయన మధ్యమ పురుషలోనే సంబోధించాడు (5:13–16).

**వచనము 10.** ఈ చివరి వచనములలో, "ధన్యతల గూర్చిన అన్యోన్య వైరుధ్యములు ఒక పతాకస్థాయికి చేరుకొనుచున్నవి."[34] యేసు, **నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది** అని పలికాడు. "హింసించు/హింసింపబడుట" అని అర్థమిచ్చు గ్రీకు పదమునకు "తరుముట, దూరముగా పారదోలుట లేక వెంటబడుట" అను భావము కలదు. ఈ పదము శారీరక దూషణ, ఇబ్బందిపెట్టుట, మరియు ఇతర విధములైన హింసను సూచించుచున్నది.

ఈ ధన్యతలో గల వాగ్దానము, **పరలోక రాజ్యము,** సర్వసాధారణముగా హింసింపబడువారికి కాదు, కానీ "నీతి నిమిత్తము" హింసింపబడువారికి మాత్రమే ఇయ్యబడినది. చెడు చేసినందుకు హింసింపబడువారికిని, హితము చేసి క్రీస్తు కొరకు హింసింపబడువారికిని మధ్య గల భేదమును పేతురు స్పష్టముగా వివరించాడు:

> క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైనయెడల మహిమాస్వరూపియైన ఆత్మ అనగా దేవుని ఆత్మ, మీ మీద నిలుచుచున్నాడు గనుక మీరు ధన్యులు. మీలో ఎవడును నరహంతకుడుగాగాని, దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరులజోలికి పోవువాడుగా గాని బాధ అనుభవింప తగదు. ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించినయెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను (1 పేతురు 4:14–16; 3:14 చూడుము).

**వచనము 11.** యేసు హింసను గూర్చిన తన ఉపదేశమును కొనసాగించాడు: **నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు.** హింసలో అవమానములు పొందుట మరియు అపవాదులు వినుట కూడ కలవు. "మనుష్య కుమారుని నిమిత్తము మనుష్యులు మిమ్ములను ద్వేషించి, వెలివేసి, నిందించి. మీ పేరు చెడ్డదని కొట్టివేయునప్పుడు మీరు ధన్యులు" అని లూకా మరి కొంచెము ఎక్కువ వివరంగా రాయుచున్నాడు (లూకా 6:22). "అవమానపరచుట" అని అర్థమిచ్చుటకు ఇచ్చట వాడబడిన గ్రీకు పదములో గంభీరముగా అవమానపరచబడుట ఇమిడియున్నది; ఈ పదమును "ధిక్కరించు" లేక "గర్వించు" అని కూడ అనువదింపవచ్చును. "పటపటమని పళ్లు కొరుకుచు పట్టుబట్టి దూషించుట" యని దీని అక్షరార్థమై యున్నది.

"నా నిమిత్తము" అనగా "క్రీస్తు నిమిత్తమని" అర్థము. ఈ పదజాలము "నీతినిమిత్తము" (5:10) అను దానికి సమానార్థమునిచ్చునదై యున్నది. ఆయన అవమానపరచబడిన విధముగానే ఆయన వాగ్దానం చేశాడు. "శిష్యుడు బోధకుని కంటె అధికుడు కాడు, దాసుడు యజమానునికంటె అధికుడు కాడని" ఆయన సెలవిచ్చాడు (10:24). వారు ఒక పట్టణములో నుండి మరొక పట్టణమునకు తరుమబడి, పట్టబడి, తీర్పు నిమిత్తము అధికారుల యొద్దకు ఈడ్వబడి, కొరడాలతో కొట్టబడి, చివరకు చంపబడుదురనియు ఆయన తన శిష్యులను

హెచ్చరించాడు (10:16-23).

**వచనము 12.** ఇటువంటి హింసల దృష్ట్యా, **సంతోషించి ఆనందించుడని** యేసు తన అనుచరులతో చెప్పాడు. “ఆ దినమందు మీరు సంతోషించి గంతులువేయుడని” లూకా 6:23 చెప్పుచున్నది. హింసలు కలుగునప్పుడు సంతోషించి ఆనందించుట నేటి శిష్యులకు సంస్కరణల సమూల మార్పునకు సంబంధించినదియు, ఆదర్శప్రాయమునై యున్నది, ఆది సంఘమునకు అది ఆ విధంగా లేకుండినది. కొరడా దెబ్బలు కొట్టబడిన తరువాత, అపొస్తలులు “ఆ నామము కొరకు అవమానము పొందుటకు పాత్రులని యెంచబడినందున వారు సంతోషించుచు మహా సభయెదుట నుండి” వెళ్లిపోయారు (అపొస్తలుల కార్యములు 5:40, 41).

**పరలోకమందు మీ ఫలము అధికమగునని** యేసు వాగ్దానమిచ్చాడు గనుకనే హింసలనుభవించునప్పుడు మనము సంతోషించి ఆనందించుట సముచితము. పరలోక దీవెనలతో పొల్చుకొన్నట్లయితే, ఇహలోకమందలి శ్రమలు చులకనైనవై యున్నవి మరియు అవి క్షణమాత్రముండునవే (2 కొరింథీయులకు 4:18).

ధన్యతలు “పరలోక రాజ్యమును” ప్రారంభంలో మాత్రమేగాక, ముగింపులో కూడ ప్రస్తావించుచున్నవి. మొదటి మరియు చివరి ధన్యతలు పరలోక రాజ్య రిఫరెన్సులు కలిగియున్నవి: “పరలోక రాజ్యము” (5:3, 10), మరియు “పరలోకమందు మీ ఫలము” (5:12).

యేసు అనుచరులు నీతి నిమిత్తము హింసలను విశ్వసనీయముగా సహించునప్పుడు, తమ స్థానమును పాత నిబంధన ప్రవక్తలతో కూడ అలంకరించుకొనుచున్నారు: **ఈలాగున వారు వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి.** ప్రవక్తలు దేవుని సందేశములను ప్రజలకందించుటకు ప్రయత్నించుచుండిన సందర్భములలో వారు ప్రజల చేత తృణీకరింపబడి దూషింపబడినప్పటికిని వారు దేవుని సేవించారు, ఆయనను గౌరవించారు (23:31, 34, 37; అపొస్తలుల కార్యములు 7:52; హెబ్రీయులకు 11:32-38; యాకోబు 5:10, 11). ఇటువంటి హింసలచేత శ్రమల ననుభవించిన వారందరు దేవుని న్యాయపీఠము యెదుట ఆయన చేత వారు సత్యవంతులనుమాట నిజమని నిరూపింపబడుదురు.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### సంతోషము వెంటబడుట (5:1-12)

మనకు సంతోషం ఎలా కలుగుతుంది? మనలను సంతోషపరచుట మరొకరి బాధ్యతయై యున్నదా? మనమాశించు సంతోషాన్ని ఐదంకెల వేతనమిచ్చు అత్యున్నత ఉద్యోగం కలుగజేయునా, లేక మన కోరికల మేరకు నిర్మింపబడియున్న నివాసస్థలమిచ్చునా? ఇక ఆహ్లాదకరమైన సమాజంలో జీవించుట వలన సంతోషం కలుగునా, లేక లాభసాటియైన ఆర్థిక పెట్టుబడులిచ్చునా? లేదు, వీటిలో ఏ ఒక్కటైనను సంతోషమును నీకియ్యజాలదు. వాస్తవమునకు, సంతోషము కొరకు ఆతురతతో ఆశపడుచు చేయబడు అన్వేషణయే నీకు అత్యంత ఆశాభంగమును మరియు అసంతుష్టిని కలుగజేయును (1 తిమోతి 6:9, 10). సంతోషమనునది అవశ్యముగా మన అంతరంగములో నుండి పెల్లుబుకు అంశమై

యున్నది. నియంత్రింపబడుచు సమతుల్యముగా నున్న జీవితము జీవించువాడే నిజమైన సంతోషముగలవాడై యున్నాడు. అనగా, ఒక వైపు దేవునితోను మరొక వైపు మన చుట్టూర నున్న తోటి మానవులతోను సరైన సంబంధము కలిగియుండుట వలననే నిజమైన సంతోషము కలుగునని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

### సరిగ్గా యేసు ఉపదేశములై యుండుటయే (5:1-12)

మత్తయి రాసిన సువార్తలో నివేదింపబడిన మొదటి నాలుగు ధన్యతలు హృదయము మరియు మనస్సు యొక్క అంతరంగ సూత్రములకు సంబంధించినవై యున్నవి. చివరి నాలుగు, మనము ఇతరులతో కలిగియుండవలసిన సంబంధముల ప్రత్యక్షీకరణములై యున్నవి. ఉదా॥ మనము "ఆత్మ విషయమై దీనులమైనప్పుడు" (5:3), దేవుడు మన పట్ల కలిగియున్న కనికరమును మనము గుర్తించగలుగుదుము. అప్పుడు మనము ఇతరుల యెడల మరి ఎక్కువ కనికరముగలవారమై యుండునట్లు అది మనలను ప్రోత్సహిస్తుంది (5:7). మన సొంత పాపములను గుర్తించి వాటి విషయమై నిజముగా దుఃఖించుట వలన (5:4) మనము మరి ఎక్కువ శుద్ధమైన జీవితము జీవించవలెనను కోరిక కలుగుతుంది (5:8) ఆత్మవిషయమై సాత్వికులముగా నుండుట వలన (5:5) మనము సమాధానపరచు విషయములను వెదకుచుండువారమౌదుము (5:9). మనము నిజముగా "నీతి కొరకు ఆకలిదప్పులుగలవారమైనప్పుడు" (5:6), యేసు అనుచరులముగా జీవించుటకు చెల్లింపవలసిన మూల్యమును మనము తెలిసికొందుము (5:10-12). "క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రదుక నుద్దేశించువారందరు హింసపొందుదురని" పౌలు భక్తుడు రచించాడు (2 తిమోతి 3:12).

డి. మార్టిన్ లాయిడ్-జోన్స్ ఈ ధన్యతలకు సంబంధించినవి ముఖ్యమైన నాలుగు సత్యములను సూచించాడు.[35] (1) ప్రతి క్రైస్తవ విశ్వాసి ఎలా జీవించాలో తెలియజెప్పుటకు అవొక వర్ణనయై యున్నవి. (2) ప్రతి క్రైస్తవుడు వాటిని సంపూర్తిగా ఆస్వాదించుటకే అవి ఉద్దేశింపబడినవి. (3) అవి స్వాభావికమైన ఉన్ముఖతలని మనము పిలుచునవి కావు; స్వాభావికముగా అబ్బు విషయములకు వ్యతిరేకమైన వాటిని చేయునట్లు అవి మనలను సవాలు చేయును. (4) మనము లోకము మరియు లోకాశలకు ధీటుగా దానిని మించి జీవించుచు, మన చుట్టూర నున్న వారి కంటె నిజముగా భిన్నమైనవారమును ప్రత్యేకమైనవారమునై యుండవలెనని అవి మనకు పిలుపునిచ్చుచున్నవి.

నేడు అనేక మంది క్రైస్తవులు, ప్రభువు సంఘమునకు సంబంధించిన అనేక సంఘ సమాజములు సహితము, మారుచున్న పరిస్థితులకును మన చుట్టూర వున్న ప్రపంచమునకును అనువుగా మార్చుకొనుచు సర్దుబాటు చేసికొను ప్రయత్నములో వారి సమయమును మరియు ధనమును వృథాచేయుచున్నారు. ఇలా చేయుట కంటె, మనము నలుగురిలో కొట్టవచ్చినట్లు కనబడుటకు పాటుపడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది (యాకోబు 4:4; 1 యోహాను 2:15-17). అది సంఘమును ముట్టడించి, దానిపై దాడిచేయుటకు మనము లోకమును అనుమతించాము, గనుక సంఘము ఎక్కువగా లోకమును పోలినదయ్యింది. ఆయన శిష్యులు, వారు లోకములో ఉన్నవారైనప్పటికిని, "వారు లోకసంబంధులు కారని" యేసు సెలవిచ్చాడు (యోహాను 17:15-17).

## క్రైస్తవుని జీవితము (5:1-12)

ఈ క్రింది దండాన్వయములను ప్రధానాంశములుగా ఉపయోగించుకొనుచు ధన్యతలపై ఒక పాఠమును సిద్ధంచేసికొనవచ్చును:

1. చాలీచాలని మన వనరులను మనము గుర్తించవలెను.
2. పాపము దేవుని హృదయమును బ్రద్దలుచేయునని మనము గ్రహించవలెను.
3. సంపూర్ణముగా దేవునికి సమర్పించుకొని ఆయనకు లోబడుము.
4. ఆధ్యాత్మిక ఆహారమును ఆసక్తితో అపేక్షించుము.
5. కనికరము కలిగియుండుటకు గుర్తుంచుకొనుము.
6. హృదయశుద్ధిగలవారై యుండుము.
7. సమాధానపరచువాడవుగా ఉందువని తీర్మానించుకొనుము.
8. హింసలు అనుభవించునప్పుడు సంతోషించి ఆనందించుము.

## దుఃఖపడువారు ఓదార్చబడుదురు (5:4)

మన పాపముల భారము మనలను బాధించుచు, భరించుటకు అది బహు భారీదైననప్పుడు (కీర్తనలు 38:4; 51:3 చూడుము), భరింపరాని ఆ భారమును యేసు మన మీది నుండి తొలగించును (మత్తయి 11:28-30). మనము విధేయతతో కూడిన విశ్వాసము ద్వారా ఆయన అనుగ్రహించు రక్షణను అంగీకరించినప్పుడు ఆధ్యాత్మిక ఆదరణ మన అంతర్యములో అధికమౌతోంది. మనము “ఓదార్చబడుదుమని” యేసు సెలవిచ్చాడు. “కాబట్టి యిప్పుడు క్రీస్తునందున్నవారికి ఏ శిక్షావిధిలేదని” పౌలు రచించాడు (రోమీయులకు 8:1). ఒకడు వాని పాపములు యేసు క్రీస్తు రక్తంలో కడిగివేయబడినవని అర్థంచేసికొన్నప్పుడు వాడు విశ్వాసము, మారుమనస్సు, మరియు బాప్తిస్మములో గొప్ప ఉపశమనమును మరియు విడుదలను పొందును. మనము ఆయన వాక్య ప్రకారము నడుచుకొనుచు ఆయన యెదుట మన పాపములను ఒప్పుకొన్నట్లయితే, ఈ ధన్యతను మనము ఆనందంగా అనుభూతిచెందుచుండుట కొనసాగుచునే యుండగలదు (1 యోహాను 1:7-10).

## నీతి కొరకు ఆకలిదప్పులు (5:6)

రక్షింపబడినవారికి దేవుడు తన కృప చేత ప్రసాదించు వరమును వర్ణించుటకు ఈ వాక్యభాగములో “నీతి” అను పదము ప్రయోగింపబడినది (2 కొరింథీయులకు 5:21). మనము విశ్వాసముతో, బాప్తిస్మము పొందవలెనను క్రీస్తు ఆజ్ఞకు లోబడినప్పుడు, దేవుడు మనలను “నీతిమంతులనుగా” తీర్చును (రోమీయులకు 3:21-26; 6:3, 4, 17, 18). క్రీస్తు యేసు బల్యర్పణను మనము అంగీకరించిన దాని ఆధారంగా దేవుడు మన విషయంలో రెండు కార్యములు చేయును: క్షమింపబడిన మన పాపములను మనకు విరోధముగా ఆరోపించుటను ఆయన ఆపుజేయును, గనుక మనలను “క్రియలు లేకుండా” “నీతిమంతులనుగా తీర్పు తీర్చును” (రోమీయులకు 4:5-9).

“నీతి” దేవుని ఆజ్ఞలను గైకొనుటను కూడ సూచించును (5:10; 6:1; 2 తిమోతి 3:16, 17; హెబ్రీయులకు 12:11). “న్యాయసంగతము” కొరకు ఆకాంక్షించుట ఆధ్యాత్మిక జీవితమునకు గురుతై యున్నది. క్రైస్తవులమైన మనము ఈ ఆధ్యాత్మిక

ఆకాంక్షను కలిగియుండనట్లయితే, మనమేమైయుండవలెనని దేవుడు కోరుచున్న దానికన్నా తక్కువౌదుము. "ధన్యకరమైన దీవెన మంచిని సాధించినవారికి మాత్రమే ప్రాప్తించినట్లయితే, మంచిని సాధించినవారెవరును లేనందునుబట్టి ఏ ఒక్కడును దీవింపబడడు. దానికి బదులుగా, పొరపాట్లు చేయుచు విఫలుడగుచున్నప్పటికినీ, మంచి నిమిత్తమైన మక్కువను ఇంకను ఎక్కువగా అంటిపెట్టుకొనియుండు వానికి అట్టి దీవెన కలుగును."[36]

మనము దేవుని వాక్యముతో నింపబడవలసినవారమై యున్నట్లయితే, ఎన్నో రోజులు ఆహారముగాని నీళ్లుగాని తీసికొననివాని వలె మనము దాని కొరకు ఆకలిదప్పులుగలవారమై యుండవలెను. దేహము కృశించి నశించును కానీ ఆత్మ నిత్యము జీవించును కాబట్టి, మనము మన కడుపులను నింపుకొనుట కంటే ఆధ్యాత్మిక ఆకలిని తీర్చుకొనుట ఎంతో ముఖ్యమై యున్నది.

## దేవుని చూచుట (5:8)

మనము చూడాలని ఆశించుదానినే చూస్తామనునది నిర్వివాదాంశమై యున్నది. ఒక విశ్వాసి ఆకాశము వైపు కన్నులెత్తి దృష్టించినప్పుడు, అతడు దేవుని చేతి పనిని చూస్తాడు (కీర్తనలు 19:1). అదే ఆకాశాన్ని ఒక నాస్తికుడు చూచినప్పుడు, అతడు అనంతమైన నల్లని శూన్యమును చూస్తాడు. పుష్పముల ప్రేమికుడు వాటి అందాన్ని చూస్తూ ఆనందిస్తూ వాటి సుగంధ పరిమళాన్ని ఆఘ్రాణిస్తాడు, కానీ శిక్షణ పొందిన వృక్షశాస్త్రజ్ఞుడు ఆ పుష్పాన్ని దాని జీవశాస్త్ర నామధేయముతో పిలుచుచు దాని నిగూఢ గుణలక్షణాల గూర్చి చర్చిస్తాడు. ఏదైనా ఒక కళాఖండమును చూచునప్పుడు, కళా విమర్శకుడు ఎంతో ప్రయాసతోను, నేర్పుతోను రచింపబడిన ఉత్తమ కృతిని చూస్తాడు, అయితే శిక్షణలేనివాడు ఆ చిత్రములోని రంగులను మరియు ఆకారములను మాత్రమే ఆస్వాదిస్తాడు. అంతిమ ఆనందం దేవుడు నిత్యత్వంలో ఉన్న రీతినే ఆయనను చూచుటయై యున్నది, కానీ ఆయనను మన అనుది సామాన్య జీవిత విషయములలో చూచుట ద్వారా మన జీవిత ప్రయాణం ఎక్కువ సఫలీకృతమైనదౌతొంది. మనము దేవుని చేతిపనులను మన చూట్టూర నున్న సమస్తములోను (రోమీయులకు 1:20), ఆయన సమకూర్పులను మన అనుదిన జీవితములోను (రోమీయులకు 8:28) చూడనగును.

## నిజముగా సమాధానపరచువారు (5:9)

మనము సమాధానపరచువారముగా నైనను లేదా ఇబ్బందులు కలుగజేయువారముగా నైనను ఉండగల సామర్థ్యము కలిగియున్నాము. మాకు సమాధానం కావాలి అని చెప్పువారందరు వాస్తవానికి సమాధాన పరచువారు కారు. మేము శాంతి సమాధానములనే కొరుకొనుచున్నామని చెప్పువారనేకులు యుద్ధాన్నే ఎంచుకొందురు. సమాధానపరచుటలో నిష్క్రియా చర్యలకు బదులుగా, యేసు క్రియాశీలంగా పాల్గొనుట గూర్చి మాటలాడుచుండెను. మనము శాంతికాముకులము కాదు, కానీ సమాధానపరచువారమై యుండవలెనని ఆయన మనకు పిలుపునిచ్చుచున్నాడు.

నేడు మనము జీవించుచున్న ఆధునిక ప్రపంచానికి, ఈ ధన్యత వంటి సముచితమైన సందేశము బహుశా, ఎన్నడును, తెలియజెప్పబడలేదేమో; "సమాధానపరచువారు ధన్యులు"

(5:9). మనుష్యులలో యుద్ధము, సకల దుఃఖము, సంక్షోభము, మరియు అనైక్యత గూర్చి నిలుకడైన ఒక బెదిరింపు ఎందుకు ఎదురగుచున్నది? ఈ ధన్యత ప్రకారము, ఈ ప్రశ్నకు ఒకే సమాధానమున్నది – పాపము, మానవ లాలస, పేరాశ, స్వార్థము, మరియు ఆత్మాభిమానము మనము ఎదుర్కొనుచున్న ఇబ్బందులన్నిటికి గల హేతువై యున్నది; అది వ్యక్తుల నడుమ కావచ్చు, ఒక దేశములోని గుంపుల మధ్య కావచ్చు, లేక దేశ దేశాల మధ్యనే కావచ్చు, సమస్త బాధలకును అనైక్యతకును హేతువు ఇదే. మానవుడు మరియు పాపమునకు సంబంధించినంత వరకు, మనము క్రొత్త నిబంధన సిద్ధాంతమును అంగీకరిస్తే తప్ప, ఆధునిక ప్రపంచం ఎదుర్కొనుచున్న సమస్యను అర్థంచేసికొనుటకు ఆరంభించలేము.

దేవుని బిడ్డ "సమాధానమును ... కలుగజేయు విషయాలనే ఆసక్తితో అనుసరించవలెనని" పిలుపు ఇవ్వబడియున్నది (రోమీయులకు 14:19). సాధ్యమైతే, విశ్వాసులు "సమస్త మనుష్యులతో" సమాధానముగా ఉండవలెను (రోమీయులకు 12:18). "సమాధానము" ఆత్మ చేత నడిపింపబడువాని జీవితములో ఉత్పన్నమగు ఫలములోని ఒక అంశమై యున్నది (గలతీయులకు 5:22). వారు "సమాధానమను బంధము చేత **ఆత్మ** కలిగించు ఐక్యమును కాపాడుకొనుట యందు శ్రద్ధగలవారై యుండవలెనని" పౌలు ఎఫెస్సు సంఘమును విన్నవించుకొన్నాడు (ఎఫెస్సీయులకు 4:1, 2).

యేసు చేసిన ప్రకటన, అంతర్యములో అవసరమగు మరియు దేవునితో కలిగియుండవలసిన సమాధానమునకు కూడ అన్వయించుకొనబడవచ్చును. "దుష్టులకు నెమ్మది ఉండదని" ప్రవక్తయైన యెషయా పలికాడు (యెషయా 48:22). మన పాపములు క్షమింపబడి మనము మన సృష్టికర్తయైన దేవునితో సమాధానము కలిగియుండనంత వరకు, మన అంతరంగములో సమాధానము కలిగియుండుట అసాధ్యము. సువార్తకు లోబడిన పిమ్మట, మన సమస్త చింతలను ప్రార్థనలో దేవుని యొద్దకు తీసికొనివెళ్లినప్పుడు, మనము "సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము" కలిగియుండగలము (ఫిలిప్పీయులకు 4:6, 7).

## హింసల రూపములు (5:10–12)

"క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రదుక నుద్దేశించువారందరు హింసపొందుదురని" పౌలు చెప్పుచున్నాడు (2 తిమోతి 3:12; యోహాను 15:20; 1 థెస్సలొనీకయులకు 3:1–4 చూడుము). మత్తయి 5:10, 11ల యేసు క్రైస్తవులకు వ్యతిరేకముగా ఎదురయ్యే విభిన్నమైన అనేక రకముల హింసలను పేర్కొన్నాడు.

*క్రైస్తవులు శారీరకంగా హింసింపబడవచ్చును.* అనేక మంది ఆది క్రైస్తవులు సిలువవేయబడినారు, స్థంభములకు కట్టివేయబడి కాల్చబడినారు, అలసిసొలిసియున్న ప్రజల ఆహ్లాదము నిమిత్తము క్రూర మృగముల చేత మ్రింగివేయబడునట్లు రంగపు బయళ్లలోనికి త్రోయబడినారు, లేదా రాత్రివేళల్లో రంగస్థలమంతా వెలుగుమయమగునట్లు మానవ కాగడాలుగా సజీవ దహనం గావింపబడినారు.[37]

*క్రైస్తవులు "అవమానపరచబడవచ్చును."* మనము నీతివంతమైన జీవితములు జీవించున్నట్లయితే, మనము అవమానపరచబడుటకును హింసింపబడుటకు ఈ లోక మర్యాదననుసరించి జీవించువారి హస్తాల్లో ఆటబొమ్మలమౌదుము (యోహాను 15:18–

20).

*క్రైస్తవుల గూర్చిన అబద్ధములు చెప్పబడవచ్చును.* బహిరంగముగా మాటలాడుటకు బదులుగా, దుష్టుల క్రైస్తవుల గూర్చి పరోక్షంగా దుర్భాషలాడుచు గుసగుసలాడుచుందురు. బహిరంగ దాడులు ఎంత హానికరమైనవై యుండునో అవి అంత హానికరమైనవై యుంటూనే, మనలను మనము ప్రతిరక్షించుకొనుటకు అవి కనీసము మనకొక అవకాశమునిచ్చును. ఇటువంటి దాడులు "వెన్నుపోట్లు" అయినప్పుడు, వాటి విషయం మనకు తెలియక మునుపే అవి మన పేరు ప్రతిష్ఠలకు తీవ్రమైన నష్టం కలుగజేయును.

అలాగైతే హింసలను ఎదుర్కొనునప్పుడు మనము ఎలా ప్రతిస్పందించవలెను? "సంతోషించి ఆనందించుడని" యేసు సెలవిచ్చాడు (5:12). అలాగని, మనము "పళ్లు బయటపెట్టి ఇకిలించుచు సహించవలెనునది" ఆయన యొక్క అసలైన భావము కాదు. మన సంతోషము సహేతుకమైనదై యుండవలెనని ఆయన మనకు గుర్తుచేయుచున్నాడు: "పరలోకమందు మన ఫలము అధికమగుట" యను వాస్తవమే ఆ హేతువై యున్నది. మన అంతిమ బహూమానము పరలోకమందు మన నిత్య నివాసమై యుండును, కానీ మన భవిష్యత్తు మాత్రమే దాని సంపూర్ణ బహుమానము కాదు (మార్కు 10:29, 30). మనము సమృద్ధియైన జీవము మరియు యేసుక్రీస్తునందు సమస్తమైన ఆధ్యాత్మిక ఆశీర్వాదములు కలిగియుందుము (యోహాను 10:10; ఎఫెస్సీయులకు 1:3).

### హింసలు (5:10–12)

కొన్ని పర్యాయములు మనకు సరైన సొంత అవగాహన లేకపోవుట వలన, మన అనాలోచననుబట్టి, లేదా అజాగ్రత్తతో గ్రుడ్డిగా ముందుకు వెళ్లుట వలన మనము శ్రమనొందుచుందుము. కొందరు వాస్తవమునకు కేవలము వారి దుష్ట కార్యముల పర్యవసానముగా ఎదురయ్యే ఐహిక పరిణామములను ఎదుర్కొనునప్పుడు, వారి విశ్వాసమునుబట్టి హింసింపబడుచున్నారని వారు నమ్మెదురు (1 పేతురు 4:14–16). ఇటువంటివారు హతసాక్షులైనట్లు వారు నటించుదురు. ఈ రకమైన "బలిపశువు" ప్రవర్తనయే కొందరిని హింసలకు గురిచేయవచ్చును. ఇటువంటివారి గూర్చి రాబిన్సన్ ఇలా చెప్పుచున్నాడు, "వారు చాలా ఉత్సాహంతో నిండినవారై యుందురు, బలవంతముగానైనా సరే వారు మతం పేరుతో గొప్పలు చెప్పుకొంటారు కానీ ఆ గొప్పతనము వారి సొంత జేబులను దాటి అవతలకు వెళ్లదు. సిలువ నిందలను భరించుచున్నారని వారనుకొనవచ్చును, కానీ వాస్తవమునకు వారే సిలువకు ఒక నిందయై యుంటున్నారు."[38]

ఇతరుల మనస్సుకు బాధకలిగించునట్లు ప్రవర్తించకుండుటకు, వారి మనస్సుకు చిరాకు కలిగించునట్లు వస్త్రధారణ చేయకుండుటకు, లేదా ఇతరుల మనస్సును గాయపరుచునట్లు మాటలాడకుండుటకు మనము తగు జాగ్రత్తపరులమై యుండవలెను. ఇతరులు మనలను తృణీకరించునట్లు లేదా మనలను నీచముగా దృష్టించునట్లు మనము ఈ విధముగా ప్రవర్తించుచు ఇతరుల మనస్సులను గాయపరచినట్లయితే, శ్రమ నొందుచున్నాము. మనకు ఆశీర్వాదకరముగా నుండునని యేసు సెలవిచ్చిన పరిస్థితి ఇటువంటిది కాదు.

సూచనలు

[1]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 106-7. [2]Leon Morris, *The Gospel According to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 95. [3]Donald A. Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 84. [4]రెండు ప్రసంగములకు సంబంధించినవి ఇదే విధమైన క్రమము కొరకు G. N. Stanton, "Sermon on the Mount\Plain," in *Dictionary of Jesus and the Gospels*, ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 736లోని చార్టు చూడుము. [5]Jack P. Lewis, *The Gospel According to Matthew*, Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 78. [6]మత్తయి 5:14, 17, 19-24, 27-31, 33-38, 41, 43, 45, 47; 6:1-8, 14-18; 7:6, 12, 15, 22, 23. [7]ధన్యతలను, ఒక "నిజమైన శిష్యుని" వైఖరిని "ఈ లోక మర్యాద ననుసరించువాని" వైఖరితో పోల్చిచూచినట్లయితే ఈ రెండిటికిని గల తారతమ్యమును ధన్యతలు చూపించునని R. T. France గుర్తించాడు (France, 109). [8]Frank L. Cox, *Sermon Notes on The Sermon on the Mount* (Nashville: Gospel Advocate Co., 1955), 7. [9]యేసును వెంబడించినవారిలో అనేకులు "శిష్యులు" అని పిలువబడిరి, కానీ యేసును వెంబడించుటలో వారు కలిగియుండిన అంకిత భావము మరియు హేతువుల స్థాయిలు వెవ్వేరై యుండినవి. వారి శిష్యత్వపు వేరు లోతులేనివారై యుండినవారు త్వరలోనే ఆయనను వెంబడించుట మానివేసారు (యోహాను 6:66-68). [10]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 35.

[11]William Barclay, *The Gospel of Matthew*, vol. 1, 2d ed., The Daily Study Bible (Philadelphia: Westminster Press, 1958), 79. [12]కీర్తనలు 14:4-6; 22:26; 34:6; 35:10; 37:14, 15; 40:17; 82:2, 3; 86:1, 2; 112:9; 113:7; 140:12, 13. [13]Hagner, 91. [14]William Barclay, *A New Testament Wordbook* (New York: Harper & Brothers, n.d.), 104. [15]Barclay, *Matthew*, 93. [16]Ibid. [17]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 39. [18]Ibid. [19]James McGill, "Blessed Are the Meek," *Spiritual Sword Lectures* (1982): 32. [20]Hagner, 93.

[21]Morris, 99. [22]John MacArthur, Jr., *The MacArthur New Testament Commentary: Matthew 1-7* (Chicago: Moody Press, 1985), 178. [23]ప్రాచీన రోమా పట్టణములోని స్తొయికులు "పురుషోచితమును" లేక "సద్గుణమును" నొక్కివక్కాణించారు. ఈ ఆలోచనా ధోరణి గ్రీసు దేశములో మొదలై రోమా పట్టణములో ఇరువురు గ్రీకు తత్త్వవేత్తల ద్వారా, Panaetius (185-110 క్రీ.పూ.) and Posidonius (135-51 క్రీ.పూ.) ప్రజాదరణ పొందినదయ్యింది. అటుతరువాతి గ్రీకు రచయిత "దయనీయతను" లేక "కనికరమును" ఆత్మ రుగ్మతల జాబితాలో చేర్చాడు. (Diogenes Laertius *Lives of Eminent Philosophers 7.*115.) [24]Talmud *Shabbath* 151b. [25]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 71. [26]MacArthur, 191. [27]Haddon W. Robinson, *The Christian Salt & Light Company* (Grand Rapids, Mich.: Discovery House Publishers, 1988), 65. [28]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnod (Grand Rapids, Mich.: Zondervan, 2002), 35. [29]Lewis, 83. [30]Hare, 42.

[31]Hagner, 94. [32]Barclay, *Matthew*, 104. [33]మైదాన ప్రసంగములోని నాలుగు ధన్యతలు కూడ మధ్యమ పురుషలో ఉన్నవి (లూకా 6:20-23). [34]Hagner, 94. [35]D. Martyn Lloyd-Jones, *Studies in the Sermon on the Mount*, vol. 1 (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., n.d.), 32-29. [36]Pat Ott, "Attitudes from the Beatitudes," *Christian Woman* (January/February 1986): 33. [37]William Byron Forbush, ed., *Fox's Book of Martyrs* (Philadelphia: Universal Book and Bible House, 1926). [38]Robinson, 89.